తిరుచానూరు ఆలయం వద్ద భక్తురాలిపై దాడి

తిరుచానూరు, ఫిబ్రవరి 15: శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి దర్శనానికి విచ్చేసిన ఓ భక్తురాలిపై ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది దాడిచేసిన ఘటన గురువారం వెలుగుచూసింది. తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన ఓ భక్తబృందం గురువారం ఉదయం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది.ఆ సమయంలో తిరుప్పావడ సేవ జరుగుతుండడంతో ఆలయంలోకి సాధారణ భక్తులను అనుమతించలేదు. సేవముగిసే సమయానికి ఒక్కసారిగా భక్తులు క్యూలైన్ వద్దకు దూసుకువచ్చారు. ఆలయం గేట్ నంబరు 4 వద్ద సేలం భక్త బృందం దూసుకుని క్యూలైన్‌వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు భద్రతా సిబ్బంది సురేష్, వారి మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటు చేసుకుంది. కోపోద్రిక్తుడైన సురేష్ ఆ భక్తబృందంలోని ఓ మహిళ తలపై మ్యాన్‌ట్యాక్‌తో కొట్టడంతో ఆమెకు గాయమైంది. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది.ఈ విషయం తెలుసుకున్న విజిలెన్స్ అధికారులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. భక్త బృందానికి సర్దిచెప్పి అమ్మవారి దర్శనం చేయించి పంపారు. దీనిపై ఆలయ విజిలెన్సు అధికారి రామమోహన్‌ను అడగ్గా ఆ భక్తురాలు తోపులాటలో క్యూలైన్లో కమ్మిపై పడి గాయపడిందని చెప్పారు.అంతే కానీ తమ సిబ్బంది దాడి చేయలేదన్నారు.ఇక్కడ పనిచేసే ఆర్జితం ఇన్‌స్పెక్టర్ గతంలో మ్యాన్‌ట్యాక్‌తో ఓ కానిస్టేబుల్‌పై దాడి చేయగా కేసు నమోదై అరెస్టు వరకు వెళ్లిన విషయం తెలిసిందే.

ఒక రోజు బ్రహ్మోత్సవానికి కొండ ముస్తాబు


ఆలయం వెలుపల, లోపల పుష్పాలంకరణ




గ్యాలరీల్లోకి చేరుకున్న భక్తులు

ఉదయం 5.30 - 8గంటల మధ్య: సూర్యప్రభవాహనం
9 - 10: చిన్నశేషవాహనం, 11 - 12: గరుడ వాహనం
మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం
2 - 3: చక్రస్నానం, 4 - 5: కల్పవృక్ష వాహనం
6 - 7: సర్వభూపాల వాహనం,
రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం

తిరుమల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సూర్యజయంతి సందర్భంగా శుక్రవారం జరగనున్న రథసప్తమి వేడుకలకు తిరుమలలో సుందరంగా ముస్తాబైంది.శ్రీవారి ఆలయంతో పాటు పలు ప్రదేశాల్లో చేసిన పుష్పాలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకించి విద్యుత్ కాంతుల్లో వెంకన్న క్షేత్రం దేదీప్యమానంగా మారింది. ఆలయం లోపల 4 టన్నుల, వెలుపల 3 టన్నుల సంప్రదాయ పుష్పాలతో అలంకరణలు చేశారు. ప్రత్యేకించి 50 వేల కట్‌ఫ్లవర్స్‌తో ఆలయంలోని పలు ప్రదేశాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. వాహనమండపాన్ని ప్రత్యేకమైన పుష్పాలు, పండ్లతో అలంకరించారు.శ్రీవారి ఉత్సవమూర్తులు ఊరేగే సూర్యప్రభ వాహనంతో పాటు మరో ఆరు ప్రధాన వాహనాలను సిద్ధం చేశారు.వాహన సేవలను వీక్షించేందుకు గురువారం సాయంత్రం నుంచే భక్తులు తిరుమల ఆలయం ముందు, మాడ వీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు.రద్దీ పెరిగిన నేపథ్యంలో సీఆర్వోలో గదులు పొందడానికి భక్తులు లేపాక్షి సర్కిల్ వరకు క్యూలైన్‌లో బారులు తీరారు. గదులు లభించని భక్తులు షెడ్లు, కార్యాలయాల, ఫుట్‌పాత్‌లపై సేదదీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు చలికి ఇబ్బందిపడుతున్నారు.

- సింహం దాడితో యాత్రికుల్లో పెరుగుతున్న ఆందోళన
- గతంలో మెట్ల దారిలో చిరుత... ఇపుడు పార్కులో సింహం మ్యానీటర్లుగా మారిన వైనం

జూలోనూ భద్రత కరువేనా?


ప్రహ్లాద్ గుర్జర్‌ను చంపేశాక ఎన్‌క్లోజర్‌లోకి చేరిన సింహం


సింహం దాడిలో చనిపోయిన ప్రహ్లాద్ గుర్జర్

తిరుమల యాత్రికులకు నడక దారిలోనే కాదు చివరికి తిరుపతి జూపార్కులో కూడా భద్రత లేదా అన్న ప్రశ్న శ్రీవారి భక్తులోకాన్ని కలవరపరుస్తోంది. అభయారణ్యంలో చుట్టూ కంచెలు, ఆంక్షలు లేని చోట్ల చిరుతల సంచారాన్ని నియంత్రించడం అసాధ్యమని సరిపెట్టుకున్నా కట్టుదిట్టమైన ఏర్పాట్లు వుండే జూపార్కులోనూ సందర్శకులకు భద్రత లేకపోవడం అన్ని వర్గాలనూ ఆందోళనకు గురి చేస్తోంది. గురువారం మధ్యాహ్నం తిరుపతి ఎస్వీ జూపార్కులో రాజస్థాన్ సందర్శకుడు ప్రహ్లాద్ గుర్జర్ (38) నేరుగా సింహాల ఎన్‌క్లోజర్‌లో దూకి సింహం దాడితో దుర్మరణం పాలైన ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.

- తిరుపతి అర్బన్/నేరవిభాగం / తిరుపతి - ఆంధ్రజ్యోతి

సింహం మ్యానీటర్‌గా మారితే?

జూపార్కులోని సింహాల ఎన్‌క్లోజర్‌లో ఇప్పటి వరకూ సందర్శకులపైన, సిబ్బందిపైనా సింహాలు దాడి చేసిన ఉదంతాలు లేవు. గతంలో అభయారణ్యం నుంచీ జూపార్కులోకి ప్రవేశించిన ఓ చిరుత దాడి చేయడంతో ఉద్యోగి ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. అది మినహా చెప్పుకోదగిన ఘటనలు లేవు. తాజాఘటనలో సింహం దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో పాటు వంద నుంచీ రెండు వందల మీటర్లు లాక్కెళ్ళింది. ఆ క్రమంలో సింహం మనిషి రక్తం, మాంసాన్ని రుచి చూసింది. ఇది మ్యానీటర్‌గా మారుతుందా అన్న భయం జూపార్కు యంత్రాంగాన్ని వేధిస్తోంది. సింహం మళ్లీ దాడులకు పాల్పడితే జూపార్కులో వైద్యులు, సిబ్బంది ప్రాణాలకు రక్షణ కల్పించడం కష్టమవుతుంది. రోజూ జూపార్కుకు సగటున 1500మంది సందర్శకులు వస్తున్నారు. వారు కొనుగోలు చేసే టికెట్లతోనూ, విరాళాలతోనూ జూ నడుస్తోంది. ఇపుడీ ఘటనతో సందర్శకుల సంఖ్య తగ్గితే మొత్తం మీద పార్కు నిర్వహణే సమస్య అవుతుంది. దీన్ని దృష్టిలో వుంచుకుని జూపార్కు అధికార యంత్రాంగం తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకుని, సిబ్బందికి, సందర్శకులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరముంది.

సిబ్బంది లేకపోవడం కూడా...

లయన్ ఎన్‌క్లోజర్‌కు వెళ్లే మార్గంలో మొదటి గేటు పది అడుగుల ఎత్తున్నప్పటికీ సిబ్బంది కాస్త దూరంలో ఉండడంతో ప్రహ్లాద్ సులభంగానే గేటును దాటాడు. ఇనుప కంచె ఉన్న ప్రదేశంలో సిబ్బంది లేకపోయినా... గేటు ఎక్కడ ఉంటే అక్కడ ఒకరైనా సిబ్బంది ఉంటే ఇలాంటి ప్రయత్నం చేసేవారిని అడ్డుకునే అవకాశం ఉండేది.మధ్యాహ్న భోజనం సమయం అయినందున సిబ్బందిలో ముగ్గురు నలుగురు ఒకేసారి భోజనానికి వెళ్లడం కూడా ఈ పరిస్థితికి అవకాశం ఇచ్చింది. అలా అందరూ ఒకేసారి కాకుండా వంతులవారీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిఉంది.

నడక దారి చిరుత దాడులతో బెంబేలు

తిరుపతి నుంచీ తిరుమలకు కాలినడక వెళ్ళే అలిపిరి మెట్ల మార్గంలో చిరుతలు, ఎలుగుబంట్లు, కొండ చిలువలు ఎన్నో ఏళ్ళుగా భక్తులను ఆందోళనకు గురి చేస్తూనే వున్నాయి. తరచూ మెట్ల దారిలో, మధ్య మధ్యన నడక దారిలో, అడపాదడపా ఘాట్ రోడ్డులోనూ ఇవి సంచరిస్తూ వుంటాయి. అయితే చిరుతలు భక్తులపై దాడి చేసేందుకు యత్నించడం మాత్రం 2010 నుంచీ మొదలైంది. ఆ ఏడాది జూలై 27న కోకిల అనే మూడేళ్ళ వయసున్న చిన్నారిపై అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి చేసింది. దాడిలో చిన్నారి గాయపడగా కుటుంబీకులు, భక్తులు కేకలు పెట్టడంతో పాపను వదిలి చిరుత పరారైంది. మరో వారానికే ఆగస్టు 2న అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం పెంచలపాడు గ్రామం నుంచీ గోవిందప్ప, గీతమ్మ దంపతులు కుటుంబంతో నడచి కొండకు వెళుతుండగా వారి ఎనిమిదేళ్ళ కుమార్తె కళ్యాణిపై చిరుత పులి దాడి చేసింది. మెడను కొరికి పట్టుకుని పంజాతో భుజాలపై గాయపరిచింది. అప్పుడు కూడా తల్లిదండ్రులు, బంధువులు, ఇతర భక్తులు గావుకేకలు పెట్టడంతో చిరుత చిన్నారిని విడిచి పారిపోయింది. తర్వాత పుష్కరం పాటు చిరుతలు కనిపించడం తప్ప దాడులు చేసింది లేదు. 13 ఏళ్ళ తర్వాత గతేడాది జూన్ 22న కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మూడేళ్ళ కౌశిక్‌పై చిరుత పులి దాడి చేసి మెడ పట్టుకుని అడవిలోకి లాక్కెళ్ళింది. తల్లిదండ్రులు, భక్తులు, చిరువ్యాపారులు కొంతదూరం వెంబడించినా ఫలితం లేకపోయింది. అయితే రిపీటర్ స్టేషన్ సిబ్బందికి చిన్నారి ఏడుపు వినిపించడంతో వారు హుటాహుటిన అడవిలోకి వెళ్ళి ప్రాణాలతో వున్న చిన్నారిని కాపాడి ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలతో బాలుడు బయటపడడం అందరినీ అబ్బురపరిచింది. తర్వాత గతేడాదిలోనే ఆగస్టు 12న నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం నుంచీ వచ్చిన కుటుంబంలో ఆరేళ్ళ చిన్నారి లక్షిత చిరుత దాడికి బలైంది. ఈ ఘటన భక్తులతో పాటు అన్ని వర్గాలనూ తీవ్రంగా కలచివేసింది. టీటీడీ తర్వాత అటవీ శాఖ వన్యప్రాణి విభాగంతో చర్చించి పలు చర్యలు తీసుకునేందుకు యత్నించింది. అందులో ప్రధానంగా బోన్లు ఏర్పాటు చేసి నాలుగు చిరుతలను బంధించారు. కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేసి వాటి కదలికలు గుర్తించి భక్తులను నడకదారిలో అప్రమత్తం చేస్తున్నారు.

సీసీ కెమెరాలు లేవు

జూలో గురువారం ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా లేకపోవడం లోపంగానే చెప్పాలి.కెమెరాలు వుండి వుంటే ప్రహ్లాద్ గుర్జర్ అక్కడికి ఎపుడు వచ్చాడనే విషయం తెలిసేది. కావాలని చేశాడా లేక అనుకోని విధంగా అలా జరిగిందా అనేవిషయం తెలుసుకోడానికి వీలయ్యేది. సీసీ కెమెరాల మానిటరింగ్ సిబ్బంది అనుమానాస్పదంగా తిరుగాడేవారిని తక్షణం గుర్తించి సిబ్బందిని అప్రమత్తంచేసి దుర్ఘటనలకు ఆస్కారం లేకుండా చూసుకోగలిగేవారు.


లయన్ ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లేందుకు ప్రహ్లాద్ గుర్జర్ ఉపయోగించుకున్న వాటర్ ట్యాంకు


ఇలా అయితే ఎలా?

పకడ్బందీ ప్రహరీ గోడ, లోపల జంతువులకు విడివిడిగా ఎన్‌క్లోజర్లు, వాటికి కాపలా, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ వంటి చర్యలతో పటిష్టంగా వున్నట్టు కనిపించే జూపార్కులో భద్రత ఎంత డొల్లగా ఉందో ఈ సంఘటన వెల్లడిస్తోంది.గురువారం ఘటనలో సందర్శకుడు ఉద్దేశపూర్వకంగా సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకి వుండచ్చు. అయితే మద్యం మత్తులోనో, మతి స్థిమితం లేకనో, ఆత్మహత్య చేసుకోవాలనో ఎవరైనా జూపార్కు సింహాల ఎన్‌క్లోజర్‌లోకి దూకేస్తే పరిస్థితి ఏమిటి? అడ్డుకోవడానికి వీలుగా భద్రతా వ్యవస్థ ఉందా? సందర్శకులు అత్యుత్సాహంతో ఎన్‌క్లోజర్‌లోకి దిగి జంతువులకు హాని తలపెడితే బాధ్యత ఎవరిది? సెల్ఫీల పిచ్చి పరాకాష్టకు చేరిన కాలంలో ఇటువంటివి జరిగే అవకాశాలున్నాయి. వీటిని నిరోధించేందుకు తగిన నిఘా వ్యవస్థ అవసరం అని తాజా సంఘటన చెబుతోంది.

అపరిచితులు

- 130గడపల వైఆర్‌కండ్రిగలో ఊరివాళ్లకు తెలీని 40 మందికి ఓట్లు

తిరుచానూరు, ఫిబ్రవరి 15: ఆ ఊళ్లో ఉండేది 130 గడపలు. ఓట్ల సంఖ్య 700. అయితే అందులో 40 ఓట్లున్న మనుషులు ఎవరో ఆ ఊళ్లో ఎవరికీ తెలీదు. 40 అపరిచితుల ఓట్లు నమోదై ఉన్న ఆ ఊరి పేరు వైఆర్‌కండ్రిగ (యాగప్పరెడ్డికండ్రిగ). చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలంలో ఉంది. ఇక్కడి పోలింగ్ బూత్ 390లో 40 మంది వరకు అపరిచిత ఓటర్లుండడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. ఇదే ఊళ్లో మరణించిన 40మంది ఓట్లు కూడా తొలగించకుండా ఉంచేశారని చెబుతున్నారు. ఇదంతా వైసీపీ నాయకుల కుట్ర అని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. టీడీపీ సానుభూతిపరులు ఎక్కువగా ఉండే ఆర్‌సీపురం మండలం అంటే వైసీపీ నేతలకు కంటగింపుగా మారిందని,. ఆధిపత్యం కోసం ఇప్పటికే వైసీపీకి అనుకూలంగా ఉన్న కొన్ని గ్రామాలకు పోలింగ్ కేంద్రాలను తరలించారని చెబుతున్నారు.అందులో భాగంగానే వైఆర్‌కండ్రిగకు పోలింగ్ కేంద్రం మార్పు చేసినట్లు టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ అపరిచిత ఓట్ల నమోదు కూడా ఇలాగే జరిగి ఉండచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బీఎల్వోల పనితీరు ఎలా ఉందో అర్థం అవుతోందని, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఆర్‌సీపురం మండలం వైఆర్‌కండ్రిగ పోలింగ్ కేంద్రంలో అపరిచిత ఓటర్లు - వైఆర్‌కండ్రిగ ఓటరు జాబితాలో కొనసాగుతున్న మృతుల ఓటర్లు

వలంటీర్లకు పురస్కారాలు



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: వలంటీర్లు నిజమైన ప్రజాసేవకులుగా పని చేయాలని ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సూచించారు. గురువారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ గురుమూర్తి తదితరులతో కలిసి వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.37మంది వలంటీర్లకు సేవా వజ్ర ప్రశంసాపత్రంతో పాటు రూ.45వేల చొప్పున, 216మందికి సేవారత్న ప్రశంసాపత్రంతో పాటు రూ.30వేల చొప్పున ,11,413మందికి సేవామిత్ర ప్రశంసాపత్రంతో పాటు రూ.15వేల చొప్పున అందజేశారు.

కత్తితో నరికి... గొంతు కోసి

- మిత్రుడి చేతిలో వడ్డీ వ్యాపారి దారుణ హత్య
- ఆర్థిక లావాదేవీలే కారణమంటున్న పోలీసులు


నిరంజన్ (ఫైల్‌ఫొటో) - సోము

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 15:తిరుపతి రూరల్ మండలం, మల్లంగుంట వద్ద గురువారం సాయంత్రం ఒక వడ్డీ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యారు.సీఐ తమీమ్ అహ్మద్ కథనం ప్రకారం... ఎస్టీవీ నగర్‌కు చెందిన విశ్రాంత సబ్‌రిజిస్ట్రార్ కృష్ణయ్య కుమారుడు నిరంజన్ వడ్డీ వ్యాపారం చేస్తుంటాడు. మల్లంగుంట హరిజనవాడకు చెందిన స్నేహితుడు సోముతో ఆర్థిక లావాదేవీల కారణంగా కొంతకాలం క్రితం గొడవ జరిగింది. అప్పటినుంచి ఇద్దరు ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు.గురువారం నిరంజన్ తన స్నేహితులతో కలిసి తుడా ప్లాట్స్ వద్ద మద్యం సేవించాడు.నిరంజన్ అక్కడున్నట్టు తెలుసుకున్న సోము ఆ ప్రదేశానికి చేరుకుని కత్తితో అతనిపై దాడిచేశాడు. గొంతు కోసి హతమార్చి పరారయ్యాడు. గొంతు సగానికి పైగా తెగిపోవడంతో నిరంజన్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ తమీమ్ అహ్మద్, ఎస్ఐ షేక్షావలి ఘటనా స్థలానికి చేరకుని పరిశీలించారు. మృతుడికి చెందిన కారులో, ఘటనా ప్రదేశంలో ఆధారాలను సేకరించారు.సోము హత్యకు పాల్పడ్డట్టు గుర్తించారు.పోస్టుమార్టం నిమిత్తం నిరంజన్ మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. సోము పాత నేరస్థుడని, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అతడిపై మూడు హత్య కేసులు ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. పరారైన అతడి కోసం గాలిస్తున్నారు.

ఎస్వీ జూలో అలజడి


జూలో పోలీసుల విచారణ

తిరుపతి అర్బన్, (నేరవిభాగం), ఫిబ్రవరి 15: మద్యం మత్తులో చేశాడో... లేక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నాడో తెలియదుగాని ఓ యువకుడు పరుగుపరుగున వెళ్లి లయన్ ఎన్‌క్లోజర్‌లోకి దూకేశాడు. ఆ పక్కనే ఉన్న ఓ సింహం అతనిపై లంఘించి గొంతు పట్టుకుని కొంతదూరం ఈడ్చుకెళ్లి చంపేసింది.గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనతో తిరుపతి శ్రీ వేంకటేశ్వర జంతుప్రదర్శన శాలలో అలజడి రేగింది. సంఘటన జరిగిన తరువాత సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న జూ క్యూరేటర్ సెల్వం తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చంద్రగిరి డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్, సీఐ తమీమ్ అహ్మద్ సిబ్బందితో కలిసి జంతు ప్రదర్శన శాలకు చేరుకుని పరిశీలించారు.మృతుడి ఛాతీపై పంజా గాయాలు, గొంతుపై లోతైన కోరల గాట్లను గుర్తించారు. అలాగే మృతుడికి సంబంధించిన ఆధార్‌కార్డు, హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చిన రైలు టికెట్టును ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి మత్తులో లయన్ ఎన్‌క్లోజర్‌లోకి దూకాడా లేక చనిపోవాలనే అలా చేశాడా అనేది చెప్పలేమని, పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తరువాతే అసలు కారణాలు తెలిసే అవకాశం ఉందని సీఐ చెప్పారు. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



భోజనానికి వెళ్లొచ్చి సందర్శకులను గమనిస్తున్నా. ఇంతలో ఒక వ్యక్తి గేటు దూకి ఎన్‌క్లోజర్ వద్దకు పరుగు తీశాడు. నేను అరుస్తూ అతనివైపు పరుగెత్తే లోపు ఎన్‌క్లోజర్ వాల్‌ఎక్కి లోపలికి దూకేశాడు. ఆ పక్కనే ఉన్న సింహం అతడి గొంతు పట్టుకుని ఈడ్చుకుపోయింది. ఈలోపు ఎన్‌క్లోజర్ దగ్గరకు వచ్చిన యానిమల్ కీపర్ జూ వర్కర్లు పెద్ద శబ్దాలు చేస్తూ సింహాన్ని అతనినుంచి దూరంగా వెళ్లేలా చేశాం.ఎలాగోలా సింహాన్ని నైట్‌హౌస్‌లోకి వచ్చేలా చేశాం. లోపలకు పోయి చూసేటప్పటికే అతను నిస్తేజంగా కనిపించాడు.

-మునిరత్నం, యానిమల్ కీపర్.

ఘటన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగింది. జరిగిన వెంటనే సిబ్బంది సమాచారం ఇచ్చారు. ఇలా ఎప్పుడూ జరుగలేదు. మరెప్పుడూ ఇలా జరగకుండా చర్యలు చేపడతాం.. భద్రత పెంచుతాం. సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేస్తాం.

- సెల్వం, జూ క్యూరేటర్.

రథసప్తమి ముస్తాబు


తిరుమల శ్రీవారి ఆలయంలో పూల అలంకరణ



పుష్పాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది - గ్యాలరీలపై ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు


విద్యుత్ కాంతుల్లో శ్రీవారి ఆలయం

రథసప్తమికి 650 మందితో బందోబస్తు : ఎస్పీ

తిరుమల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా తిరుమలలో 650 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మలిక గర్గ్ తెలిపారు. బందోబస్తు కోసం వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బందితో ఆమె గురువారం రాత్రి పోలీసు కాంప్లెక్స్ ముందు సమావేశమయ్యారు. విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలగాల్సిన తీరుపై పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ లక్షమందికిపైగా భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో క్రమశిక్షణతో, దురుసుతనం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. ఘాట్ రోడ్లతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో నిఘా ఉంచాలన్నారు. అనుమానాస్పదంగా ఎవరైనా తారసపడితే వెంటనే పై అధికారులకు తెలియజేయాలన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా జియో ట్యాగులు వేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా వాహనాలను పార్కింగ్ ప్రదేశాలకు మళ్లించాలన్నారు. అనంతరం ఆమె గ్యాలరీలు, మాడవీధులు, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు.

మరణించి.. ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపి

- రుయాస్పత్రిలో బ్రెయిన్ డెడ్‌కు గురైన మహిళ
- రెండు కళ్లు రుయాస్పత్రి, కిడ్నీలు స్విమ్స్‌కు దానం


అవయవదానానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న చిన్నబాబు


బ్రెయిన్ డెడ్‌కు గురైన మహిళ హరిత

తిరుపతి సిటీ/రామచంద్రాపురం, ఫిబ్రవరి 15 : రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన దెబ్బతగిలి రెండు రోజులుగా స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మహిళ చివరకు బ్రెయిన్ డెడ్ అయింది. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె కళ్లను రుయాస్పత్రికి, కిడ్నీలను స్విమ్స్‌కు దానం చేశారు.రామచంద్రాపురం మండలం కమ్మపల్లికి చెందిన బొల్లిపల్లి హరిత (36) తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తోంది. ఈ నెల 12న కమ్మపల్లి నుంచి తెలిసిన వారి ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురైంది. తలకు బలమైన గాయం తగలడంతో వెంటనే స్విమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స అందించినా బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు చెప్పి అవయవదానం గురించి వివరించారు. మొదట్లో వారు నిరాకరించారు. వారికి సన్నిహితంగా ఉండే రుయాస్పత్రి వర్కింగ్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నబాబు, నీలకంఠ చౌదరి అవయవ దానం గురించి వివరించి, ఒప్పించారు. ఆమె గుండె, లివర్ అప్పటికే పనికిరాకపోవడంతో కళ్లు, కిడ్నీలను మాత్రమే సేకరించారు.కళ్లను రుయాస్పత్రి ఐ బ్యాంక్‌కు తరలించారు. వాటిని హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలిస్తామని వైద్యులు తెలిపారు. కిడ్నీల్లో ఒకటి నెల్లూరుకు పంపగా మరొకటి స్విమ్స్‌లోనే మరో వ్యక్తికి అమర్చినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మహిళ మృతదేహాన్ని స్విమ్స్ అధికారులు స్వగ్రామానికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అవయవాలు దానం చేసిన ధ్రువీకరణ పత్రాన్ని వారికి అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హరిత భర్త మురళి ఏడాది కిందట అనారోగ్యంతో మృతిచెందడం, ఇప్పుడు ఆమె రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో పదో తరగతి చదువుతున్న వారి కుమారుడు, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్తె దిక్కులేని వారయ్యారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కోరారు.

భారీ ఉపగ్రహంతో రేపు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 ప్రయోగం


ప్రయోగ వేదికపై జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్

- నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15: అంతరిక్షంలో 2,275 కిలోల బరువు గల ఇన్‌శాట్-3డీ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టే జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు.శ్రీహరికోట షార్ సెంటర్ నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.శుక్రవారం మధ్నాహ్నం 2.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమై 27.30 గంటల పాటు కొనసాగుతుంది. ఇప్పటికే రెండో ప్రయోగవేదిక మీద బాహుబలి జీఎస్ఎల్వీ సిద్ధంగా ఉంది. ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశం (ఎంఆర్ఆర్) వర్చువల్ పద్ధతిలో గురువారం జరిగింది. అనంతరం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాల్లో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్)సమావేశమై ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కౌంట్‌డౌన్ జరిగే సమయంలో రాకెట్‌లో ఇంధనం,హీలియం, నైట్రోజన్ గ్యాస్‌లను నింపుతారు.ప్రయోగానికి 8 గంటల ముందు రాకెట్‌కు విద్యుత్ సరఫరా చేసి మిషన్ కంట్రోల్ సెంటర్‌లోని సూపర్ కంప్యూటర్లకు అనుసంధానం చేస్తారు.కౌంట్‌డౌన్ పూర్తవగానే రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగివైపు దూసుకెళ్తుంది.వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం ఉద్దేశించిన ఇన్‌శాట్-3డీ ఉపగ్రహ ప్రయోగం పట్ల భారతదేశం ఆసక్తితో ఎదురు చూస్తోంది.


రాకెట్ శిఖర భాగంలో ఇన్‌శాట్-3డీ ఉపగ్రహం

స్టైఫండ్ కోసం జూనియర్ డాక్టర్ల నిరసన

- రోజంతా రుయాస్పత్రి ముందు ఆందోళన


రుయాస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 15 : ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్‌ను తక్షణమే చెల్లించాలని కోరుతూ రుయాస్పత్రిలోని జూడా(జూనియర్ డాక్టర్లు)లు గురువారం ఆస్పత్రి కార్యాలయ భవనం ముందు నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో చదువుకుంటూ రుయాస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న 200 మంది జూనియర్ డాక్టర్లకు గత ఏడాది అక్టోబరు నుంచి స్టైఫండ్ ఇవ్వలేదన్నారు. ఒక్కొక్కరికి రూ.లక్షకు పైగా స్టైఫండ్ రావాల్సి ఉందని తెలిపారు. హెచ్‌వోడీలను అడిగితే మీరు సకాలంలో డ్యూటీ సర్టిఫికెట్స్ అందించకపోవడం వల్లే బిల్లులు పెట్టేందుకు వీలు పడలేదని, ప్రస్తుతం గత ఏడాదికి సంబంధించిన స్టైఫండ్ విడుదల చేసే అవకాశం లేదని, గడిచిన రెండు నెలలకు మాత్రమే అందించే అవకాశం ఉందని చెబుతున్నారని వాపోయారు. తమ విధులకు సంబంధించిన రికార్డుల పూర్తి బాధ్యత హెచ్‌వోడీలే చూసుకుంటారని, ఇప్పుడు మాత్రం దాటవేత ధోరణి అవలంబించడం అన్యాయమని పేర్కొన్నారు. ఐదు నెలల స్టైఫండ్ చెల్లించకపోతే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని వారం కిందటే కళాశాల ప్రిన్సిపాల్, రుయాస్పత్రి సూపరింటెండెంట్ల దృష్టికి తెచ్చామని, వారు స్పందించకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం రోగులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా కొంత మంది విధులు కొనసాగిస్తున్నారని, సమస్య పరిష్కరించకపోతే పూర్తిస్థాయిలో సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. చివరకు కలెక్టర్ లక్ష్మీశా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వైసీపీ మఠం!



- హథిరాంజీ మఠంలో పెరిగిన ప్రభుత్వ జోక్యం
- రాజకీయ వేధింపులకు వాడుకుంటున్న వైనం
- దారికి రానివారికి పొక్లెయిన్లతో బెదిరింపు
- విపక్షాల ఆర్థికమూలాలపైనా దెబ్బ
- మహంతును నియమించకుండా ఇష్టారాజ్యం
- మఠం ఆస్తులపై కన్నేసిన అధికార పెద్దలు

తిరుపతి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని స్వామి హథిరాంజీ మఠం...వైసీపీ పెద్దల మఠంగా మారిపోతోంది. కస్టోడియన్‌గా ఉన్న మహంతు కాసులకు కక్కుర్తిపడి మఠం ఆస్తులను అన్యాక్రాంతం చేశారన్న ఆరోపణలతో ధార్మిక పరిషత్ ఆయనను పక్కన పెట్టేసిన విషయం తెలిసిందే. మహంతును తొలగించిన నెలరోజుల వ్యవధిలో మరో మహంతును నియమించాలన్న హైకోర్టు తీర్పును కూడా పక్కనపెట్టేసి ప్రభుత్వమే పెత్తనం చెలాయిస్తోంది. ఈనేపథ్యంలో వైసీపీ పెద్దలు మఠం ఆస్తులపై పడ్డారు.వాటిని అన్యాక్రాంతం చేయడమే కాకుండా, అధికారాన్ని అడ్డుపెట్టుకుని విపక్ష నాయకులను వేధించడం మొదలుపెట్టారు.

- వైరంతో వేధింపులు

తుమ్మలగుంట చెరువు సమీపంలో మఠం స్థలంలో గురువారం రెవెన్యూ అధికారులను ఉసిగొల్పి ఒక నిర్మాణాన్ని తొలగించారు. వైసీపీ నాయకుడితో వైరం రావడమే నిర్మాణాల తొలగింపునకు కారణంగా తెలుస్తోంది. సదరు నేత మౌఖిక ఆదేశాల మేరకు ఆర్డీవో నేతృత్వంలో రూరల్ తహసీల్దార్, మఠం సిబ్బందితో కలసి తుమ్మలగుంటకు వెళ్లారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి సొంతూరులో ఆక్రమణల తొలగింపు అని తెలియగానే సిబ్బంది తొలుత అయోమయంలో పడ్డారు.పొక్లెయిన్‌తో అక్కడికి వెళ్లిన తర్వాత రాజకీయంగా విబేధిస్తున్నవారిని వేధించే ప్రక్రియలో భాగంగానే జరిగినట్టుగా స్పష్టమైంది. దాదాపు 20 ఎకరాలు అక్కడి లీజుదారులనుంచి క్రయ,విక్రయాలు జరిగిపోయినట్టు తెలుస్తోంది. గుట్టుచప్పుడుకాకుండా ఆక్రమణల తొలగింపునకు పూనుకోవడం పట్ల సర్వత్రా అనుమానాలు కలుగుతున్నాయి.

- అవిలాలలో అప్పుడలా...

వైసీపీ అధికారంలోకి వచ్చీరాగానే తిరుపతి రూరల్ మండలం అవిలాల ప్రాంతంలోని హథిరాంజీమఠానికి చెందిన 108.6 ఎకరాల్లో 130వరకు అక్రమ కట్టడాలున్నాయంటూ పొక్లెయిన్లతో రెవెన్యూ అధికారులు దిగిపోయారు.అడ్డొస్తే పీడీ యాక్టు పెడతామని హెచ్చరించారు.చాలావరకు కూలదోశారు. రూరల్ పరిధిలోనే 552 ఎకరాలు మఠం భూమి ఉన్నట్టు గుర్తించామని అంతా స్వాధీనం చేసుకుంటామన్నారు. పదో పరకో పెట్టి తక్కువ రేటుకు వచ్చిందని మధ్యవర్తుల దగ్గర కొనుక్కున్న మధ్యతరగతి ప్రజలు బెంబేలెత్తిపోయారు.శరణు, శరణు..అంటూ ప్రజాప్రతినిధి దగ్గరకు పరుగులు తీశారు. అంకణానికి ఒక రేటు కట్టి వారే కొనుగోలు చేయడం, లేదా ఇల్లుకట్టుకోవాలని చెప్పినవారికి మరో రేటు కట్టించుకోవడం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అప్పుడు అక్రమమైన నిర్మాణాలు ఇప్పుడు సక్రమమైపోయాయి. యధావిధిగా నిర్మాణాలు జరిగిపోయాయి. ఆ సమయంలో టీడీపీ నాయకులను తమ దారిలోకి వచ్చేటట్టు కూడా చేసుకున్నారు.ఇక ఎప్పుడో 30ఏళ్లక్రితం ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వు మేరకు మఠం దగ్గర కొనుగోలు చేసిన స్థలంపై వైసీపీ పెద్దలకు ఇప్పుడు కన్ను పడింది. టీడీపీ నేతలకు చెందిన స్థలం కావడం, భూముల విలువ పెరగడంతో వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టే వికృత క్రీడ మొదలుపెట్టారు. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తప్పంటూ మఠంపై ఒత్తిడి తీసుకొచ్చారు. న్యాయస్థానంలో స్పెషల్ లీవ్ పిటీషన్ (ఎస్పీఎల్) వేసి, న్యాయం తమవైపు లేదని తెలిసినా భారీ మొత్తంలో లాయర్‌కు చెల్లించాల్సిన ఫీజు భారం మఠంపై వేయడం కొందరు సిబ్బంది విస్తుపోతున్నారు.

- టీడీపీ నేతల భూములపై కన్ను

చంద్రగిరి నియోజకవర్గం పుదిపట్ల గ్రామ సర్వే నెంబరు 51/1, 54/2లోని 25.36 ఎకరాల హథిరాంజీ మఠం భూమిలో 1950 నుంచి మునస్వామినాయుడు, చెంగమ్మ కుటుంబసభ్యులు లీజుదారులుగా వ్యవసాయం చేసేవారు. ఎకరా రూ5,500లకు మఠానికి చెందిన వ్యవసాయ భూమి విక్రయించవచ్చని 1985లో ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. అయినా ఎవరూ ముందుకు రాకపోవడంతో 1990లో ఎకరా రూ.22వేల చొప్పున లీజుదారులకు విక్రయించమని ప్రభుత్వం (జీవో నెం.751) ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో లీజుదారులైన చెంగమ్మ, మునస్వామి నాయుడు రూ.22వేల చొప్పున మఠానికి చెల్లించి కస్టోడియన్ నుంచి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. బహిరంగ వేలం వేయకుండా మఠం ఎలా విక్రయిస్తుందని పలువురు ప్రైవేట్ వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించినప్పటికీ లీజుదారులకు అనుకూలంగానే తీర్పు వచ్చింది. ఈక్రమంలో స్థలంలో పెరిగిన చెట్లను తొలగించి, చదును చేయడంతో వైసీపీ పెద్దల కన్ను పడింది. అప్పటి ప్రభుత్వం అవగాహన లేకుండా ఉత్తర్వు ఇచ్చిందని, జీవోను రద్దుచేయాలని అధికార పార్టీ నేతలు స్థలాన్ని చట్టబద్ధంగా విక్రయించిన మఠం తరఫున కోర్టును ఆశ్రయించమని ఒత్తిడి తీసుకొచ్చినట్టు తెలుస్తోంది. దీంతో చేసేదిలేక సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసి సదరు స్థలంపై స్టేటస్కో తీసుకొచ్చారు. తుది తీర్పు వచ్చేవరకు మఠం గానీ, లీజుదారులు గానీ సదరు స్థలంలోకి వెళ్లకూడదని సుప్రీం కోర్టు తీర్పుఇచ్చింది.

- పైడిపల్లి వద్ద తోడేస్తున్న ఇసుక

చంద్రగిరి నియోజకవర్గంలోని పైడిపల్లి స్వర్ణముఖీ పరీవాహక ప్రాంతంలో దాదాపు 70 ఎకరాల మఠం స్థలంలో వైసీపీ పెద్దలు ఇసుక తోడుకుని కోట్లాదిరూపాయలు గడిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వ్యవసాయం కోసమని తక్కువ ధరకే మఠం నుంచి బినామీ పేర్లతో స్థలాన్ని తీసుకుని ఫెన్సింగ్ వేసుకుని మరీ ఇసుకను యదేచ్ఛగా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. నిత్యం పెద్దఎత్తున ఇసుక లోడ్లుకొద్దీ తరలిస్తున్నారని మఠం అధికారులకు తెలిసినా మౌనం వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సదరు స్థలానికి జరిగిన బహిరంగ వేలంలో వైసీపీ ముఖ్యనేత సోదరుడే దగ్గరుండి బయట వ్యక్తులను రానివ్వకుండా చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి.

- గతంలో గవర్నర్‌కు బీజేపీ లేఖ

1843 నుంచి 1933 వరకు తిరుమల శ్రీవారి ఆలయ నిర్వహణ బాధ్యతలను మఠం నిర్వహించింది. ఆ కాలంలో అనేక మంది భక్తులు స్థిరాస్తులతో పాటు అనేక విలువైన ఆభరణాలు శ్రీవారికి కానుకగా ఇవ్వడం జరిగింది. వాటిలో ఎక్కువభాగం ఇప్పటికే దురాక్రమణకు గురై అన్యాక్రాంతమయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం ఆస్తులను మదింపు చేయించి, జరిగిన అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అదేవిధంగా ధార్మిక సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వ జోక్యం నిలువరించాలని గతంలో గవర్నర్‌కు బీజేపీ నాయకులు లేఖ రాసినా ప్రయోజనం లేకుండా పోయింది. తిరుపతిలోని హథీరాంజీ భూములపై సమగ్ర సర్వే చేయించి పరిరక్షించాల్సిన అవసరం ఉంది.



హథీరాంజీ మఠం భూముల్లో ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 15: తుమ్మలగుంటలోని హథీరాంజీ మఠం భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. మఠం అధికారి కె.రమేష్‌నాయుడు ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల అండతో మఠం అధికారులు అక్రమ నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, తిరుపతి రూరల్ తహసీల్దార్ మహబూబ్ చాంద్, మఠం సిబ్బంది సీతారామయ్య, మునివెంకటేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

పేటమిట్టలో కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ


కుంభాభిషేకంలో భాగంగా కలశానికి అభిషేకం

సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు - ఆలయ ప్రాంగణం

- కమనీయంగా సీతారాముల కల్యాణం
- ముగిసిన కుంభాభిషేక మహోత్సవాలు


దేవతామూర్తుల విగ్రహాలు


పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు

పూతలపట్టు, ఫిబ్రవరి 15: పూతలపట్టు మండలం పేటమిట్టలో గురువారం కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకాన్ని భక్తజనరంజకంగా నిర్వహించారు. దీంతో నాలుగు రోజులుగా జరుగుతున్న మహోత్సవాలు ముగిశాయి. తమ స్వగ్రామంలో ఒకే ప్రాంగణంలో విరూపాక్షమ్మ అలయంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి కోదండరామస్వామి ఆలయాన్ని అమరరాజా సంస్థల అధినేత డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు నిర్మించారు. ఈనెల 12న విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు మొదలయ్యాయి. నాలుగో రోజైన గురువారం ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య కోదండరామస్వామి, సీతామహాదేవి, లక్ష్మణ స్వామి, దాసాంజనేయస్వామి విగ్రహాలను వేదపండితులు ప్రతిష్ఠించారు. నేత్రబంధనం, అఖండ దీపస్థాపనం, కవాట బంధనం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 8 గంటల నుంచి గోపూజ, విశేష వాహనాలు, ప్రధాన కలశాల స్థాపన, శోభాయాత్రను జరిపి, 9.15 గంటలకు సమస్త ప్రతిష్ఠ దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతితో ఈ మహోత్సవాలు ముగిశాయి. ఉదయం 10.30 గంటలకు గల్లా జయదేవ్ దంపతులు, గల్లా రామచంద్రనాయుడు దంపతులు, గౌరినేని రమాదేవి దంపతుల చేతులమీదుగా సీతారామకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఆయా కార్యక్రమాల్లో గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, గౌరినేని ప్రసాద్, గౌరినేని రమాదేవి, గౌరినేని హర్షవర్ధన్, గౌరినేని విక్రమ్, గల్లా అశోక్, గల్లా సిద్ధార్థ, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్వీ నాయుడు, టీడీపీ నాయకులు టీడీ జనార్దన్, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, యువరాజులు నాయుడు, గంగారపు గోపి, దొరబాబు చౌదరి, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణమ నాయుడు, గల్లా రాజశేఖర్ నాయుడు, భానుమూర్తి నాయుడు, గల్లా రామానాయుడు, సంపత్ నాయుడు, పీఆర్వోలు బాబీ, పద్మనాభ చౌదరితో పాటు గల్లా కుటుంబీకులు, చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.

25న తెలంగాణ, కర్ణాటక సీఎంల రాక

- ఎస్వీయూ స్టేడియంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- వీసీ అనుమతి కోరిన కాంగ్రెస్ స్థానిక నాయకత్వం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 15: ఈ నెల 25వ తేదీన తిరుపతికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రానున్నారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని తారకరామా స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. ఈ సభకు తారకరామా స్టేడియం కేటాయించాలని కోరుతూ ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు పూతలపట్టు ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు పాల్గొన్నారు.



సంస్కృత వర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభం



తిరుపతి (విద్య), ఫిబ్రవరి 15: పురుషోత్తముడు శ్రీవేంకటనాయకుడు అనే అంశంపై జాతీయ సంస్కృత వర్సిటీలో పురాణేతిహాస విభాగం ఆధ్వర్యంలో రెండ్రోజుల జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వచ్చిన కాంచీపురానికి చెందిన చంద్రశేఖరేంద్ర సరస్వతి మహావిద్యాలయం వీసీ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్, రాష్ట్రపతి పురస్కార గ్రహీత కొంపెల్ల రామసూర్యనారాయణతో కలసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేంకటేశ్వరుని మహత్యాన్ని, పురాణాలలో వర్ణించిన విషయాలను చక్కటి ఉదాహరణలతో వివరించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వేంకటేశ్వరుని మహత్యాన్ని పురాణాల్లో ఏవిధంగా వర్ణించారన్న అంశాన్ని కూలంకషంగా చర్చించి, తద్వారా ఆధ్యాత్మిక శక్తిని, శాస్త్రీయ జ్ఞానాన్ని విద్యార్థులు, అధ్యాపకులకు అందించాలని ఆకాంక్షించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్ విభీషణ్‌శర్మ, అకడమిక్ డీన్ టీవీ రాఘవాచార్యులు, సాహిత్య సంస్కృతి డీన్ లలితారాణి, పురాణ ఇతిహాస విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పరిమితపండా పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో రథసప్తమికి ఏర్పాట్లు



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 15: రథసప్తమి వేడుకలకు తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. ఏడు వాహనాలపై స్వామి వారు ఊరేగనున్నారు. చక్రస్నానం కోసం పుష్కరిణిని సిద్ధం చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ పూర్తి చేశారు. తెల్లవారుజామున 5:30 గంటలకు వాహన సేవలు ప్రారంభం కానున్నాయి. రథసప్తమికి చేయవలసిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, తుడా ఛైర్మన్ మోహిత్‌రెడ్డి ఆలయాధికారులకు తగిన సూచనలు చేశారు.

రథసప్తమికి తిరుచానూరు ముస్తాబు

తిరుచానూరు, ఫిబ్రవరి 15: రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని తిరుచానూరు ముస్తాబైంది. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని అమ్మవారు సప్తవాహనాలపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయంలో వేకువజామున నిర్వహించే అభిషేకం మినహాయించి తరువాత నిర్వహించే, లక్ష్మీపూజ, కల్యాణోత్సవం, కుంకుమార్చన వీఐపీ బ్రేక్ సేవలను రద్దు చేసినట్లు ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ వెల్లడించారు.కాగా పద్మావతి అమ్మవారిని జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్ గురువారం దర్శించుకున్నారు.

రథసప్తమికి ఆలయాలు ముస్తాబు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 15 : రథసప్తమి వేడుకకు నగరంలోని ఆలయాలు సిద్ధమయ్యాయి. ఏటా మాఘమాసం శుక్లపక్ష సప్తమి తిథిన రథసప్తమి జరుపుకుంటారు. వేదంలో ఆ రోజున సూర్యుడు ఏడు గుర్రాలతో కూడిన రథంపై ప్రయాణిస్తాడనే వర్ణన ఉంది. ఈ పండుగనే సూర్య జయంతి, మాఘసప్తమి అని కూడా అంటారు. నగరంలోని కోదండరామస్వామి, గోవింద రాజస్వామి ఆలయాలతో సహా పలు వైష్ణవ ఆలయాలలో రథసప్తమి ఘనంగా జరుపుకుంటారు. వాహన సేవలతో గోవిందుడు భక్తులకు కనువిందు చేస్తాడు. ఈ మేరకు అన్ని ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

పీవీకి భారతరత్న అభినందనీయం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 15 : మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల తిరుపతి అర్బన్ బ్రాహణ సేవా సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో గురువారం పీవీ చిత్రపటానికి ఘన నివాళి అర్పించారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బ్రాహ్మణ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు భాగవతుల జయలక్ష్మి, తిరుపతి ఫిలిం సొసైటీ ఎడిటర్ అక్కిరాజు శంకరమణి, బ్రాహ్మణ సేవా సంఘం కార్యదర్శి శేషగిరిరావు, కవి, రచయిత దూబగుంట రామకృష్ణ, సి.హనుమంతరావు, పి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన ఘంటసాల గాన విభావరి



తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 15: అమర గాయకుడు ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుపతిలోని ఘంటసాల గాన కళాపీఠం గురువారం సాయంత్రం ఎమ్మార్‌పల్లి కూడలిలో సంగీత విభావరి నిర్వహించింది. నగరానికి చెందిన పలువురు గాయకులు పాల్గొని ఘంటసాల గీతాలను ఆలపించారు. గాన కళాపీఠం అధ్యక్షుడు మల్లం విజయ్‌కుమార్ రెడ్డి, కార్యదర్శి జి.ఉదయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12: ఎస్వీయూలో గ్లోరీ గ్లోబల్ సొల్యూషన్స్ సంస్థ చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. బీటెక్ నాల్గవ సెమిస్టర్‌కు చెందిన వీరిని పరీక్షించిన కంపెనీ ప్రతినిధులు రూ.4 లక్షల వార్షిక వేతనంతో నియామక ఉత్తర్వులు అందజేశారు. విద్యార్థులను వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 15: త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. రాజంపేట అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అధ్యాపకులు వెంకటేష్ అవగాహన కల్పించారు. త్రీడీ టెక్నాలజీ అనేది ఫార్మసీ, క్లినికల్ ఫార్మసీలో మంచి ఫలితాలు ఇస్తోందన్నారు.



సమ్మోహనం సంగీతోత్సవం



సంగీత సదస్సులో పాల్గొన్న ఆచార్యులు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 15 : గానం, గమకం, జతులు యతులతో కూడిన సంగీత స్వరాలాపనతో యువ విద్యార్థులు ప్రదర్శించిన కచేరీలు మహతిలోని సంగీతాభిమానులను అలరించాయి. శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల, డోలు-సన్నాయి పాఠశాల ఆధ్వర్యంలో జరుగుతున్న దక్షిణ భారత సంగీత నృత్యోత్సవంలో రెండవ రోజు గురువారం ఉదయం 10 గంటలకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల గాత్రకచేరీతో కార్యక్రమాలు మొదలయ్యాయి. చెన్నై డాక్టర్ జయలలిత సంగీత-లలితకళల విశ్వవిద్యాలయం, కేరళ రాష్ట్రం, ఎర్నాకులం జిల్లా, త్రిపుంతిర పట్టణ ప్రభుత్వ ఆర్.ఎల్.వి సంగీత లలిత కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాహిత్య సభలో ఆచార్య ఆర్ఎస్ నందకుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సంగీత విద్యలో టెక్నాలజీ పాత్ర అనే అంశంపై మాట్లాడుతూ భారతీయ ఆత్మ, హృదయమూ సంగీతమేనన్నారు. డాక్టర్ రాధ సారంగపాణి (తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు) సంగీత అధ్యయనంలో టెక్నాలజీ వినియోగం గురించి వివరించారు. డాక్టర్ రాజశ్రీ రామకృష్ణ (మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై), డాక్టర్ ఆర్.ఎన్.ఎస్‌శైలేశ్వరి (శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం, తిరుపతి), డాక్టర్ వి.బాలసుబ్రమణ్యం(సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి) పత్ర సమర్పణ చేశారు. సాయంత్రం తిరుపతి శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థుల లయవిన్యాసం, రసరిషి హంపి కన్నడ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన గాత్ర కచేరి అలరించాయి. త్రిసూర్‌కు చెందిన కౌస్తుభం డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు మోహినీఅట్టం ప్రదర్శించగా, రాత్రి 8 గంటలకు సిద్ధేంద్ర కళాపీఠం, కూచిపూడి నృత్యాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి శిష్యులు భక్తప్రహ్లాద అనే యక్షగానం ప్రదర్శించారు.

విద్వాంసులకు సత్కారం..

సంగీతోత్సవంలో భాగంగా గురువారం సాయంత్రం ఎస్వీ నాదస్వరం, డోలు పాఠశాల విశ్రాంత, ప్రస్తుత ఉపాధ్యాయుడు వి.సత్యనారాయణ, జి.లక్ష్మయ్య, పి.సుబ్రహ్మణ్యం, పి.గోవిందశెట్టి, ఊట్లవారిపల్లె మునిరత్నం సత్కారం అందుకున్నారు. టీటీడీ ముఖ్యగణాంకాధికారి శేషశైలేంద్ర, డీఈవో భాస్కర రెడ్డి, ఫెడరల్ బ్యాంకు డిప్యూటి ఉపాధ్యక్షులు స్వాతి ప్రియ, చీఫ్ మేనేజర్ విజయభాస్కర్, సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేడు.. : కళావైభవం ఉత్సవాల్లో శుక్రవారం మహతి వేదికలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సంగీత కార్యక్రమాలు జరుగుతాయి. 12 గంటలకు సదస్సు ఉంటుంది. పలువురు ఆచార్యులు పత్రసమర్పణ చేస్తారు. సాయంత్రం 4 గంటలకు శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులు శ్రీకృష్ణ లీలావిలాసం నృత్యరూపకం ప్రదర్శిస్తారు. 6 గంటలకు కూచిపూడి నృత్యరూపకం శ్రీరామ కథాసారం ప్రదర్శిస్తారు.

శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మించిన ఆలయాల్లో సామాజిక తనిఖీలు

తిరుమల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు(శ్రీవాణి) నిధులతో ఇటీవల కొన్ని జిల్లాల్లో నిర్మించిన ఆలయాల్లో సామాజిక తనిఖీ నిర్వహించామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఆలయాల నిర్మాణంపై ఆయన సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్టు ద్వారా సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మత్స్యకార, గిరిజన, వెనుకబడిన తరగతులు ఉన్న ప్రాంతాల్లో 320 ఆలయాల నిర్మాణం పూర్తయిందన్నారు. ఇందుకోసం దాదాపు రూ.26 కోట్లు వ్యయం చేసినట్టు చెప్పారు. ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ సంస్థల ద్వారా సామాజిక తనిఖీ చేయించినట్లు తెలిపారు. 50 ప్రశ్నలతో ప్రశ్నావళి రూపొందించి అన్ని ఆలయాల పరిసర ప్రాంతాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేసిందని, ఆలయాల నిర్మాణం వారికి ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో మతమార్పిడులు దాదాపుగా ఆగిపోయాయని స్పష్టమైందన్నారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏవో బాలాజీ, డీఎల్వో వీర్రాజు, సీఏవో శేషశైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంత దురుసుతనం ఏంటి గోవిందా!

గది పొందేందుకు అడ్డదారిలో దూరాడనే కోపంతో ఓ టీటీడీ ఉద్యోగి భక్తుడి పట్ల దురుసుగా ప్రవర్తించాడు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా గురువారం గదులు పొందేందుకు సీఆర్వో వద్ద భక్తులు భారీగా బారులు తీరారు. ఈ క్రమంలో ఓ భక్తుడు క్యూలో నిరీక్షించలేక అడ్డదారిలో ప్రవేశించాడు. గమనించిన టీటీడీ ఉద్యోగి ఆగ్రహంతో ఆ భక్తుడి షర్ట్ పట్టుకుని బయటకు లాక్కువచ్చాడు. ఇలా దురుసుగా ప్రవర్తించడం విమర్శలకు దారితీసింది. వెలపలకు వచ్చిన భక్తుడు షర్టు పట్టుకుని బయటకు లాక్కురావాల్సినంత తప్పు తాను ఏం చేశానంటూ ఆవేదన వ్యక్తం చేశాడు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

సాగునీటి వ్యవస్థను పటిష్ఠం చేయండి

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 15: జిల్లాలో సాగునీటి పారుదల వ్యవస్థను పటిష్ఠం చేయాలని కలెక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జేసీ శుభం బన్సల్‌తో కలిసి రోడ్లు, భవనాలు, నీటి పారుదల, గ్రామీణ నీటి సరఫరా, ఇరిగేషన్ శాఖలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు సుధాకర్ రెడ్డి, శంకర్‌నారాయణ, విజయకుమార్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రుయాస్పత్రికి వీల్‌చైర్ల వితరణ



తిరుపతి సిటీ, ఫిబ్రవరి 15 : స్థానిక ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ లక్ష్మీపతిరెడ్డి తన తండ్రి జయరామిరెడ్డి జ్ఞాపకార్థం రూ.లక్ష విలువచేసే పది వీల్‌చైర్లను గురువారం రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభుకు అందజేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల కోసం వాటిని వాడాలని కోరారు. భవిష్యత్తులోనూ ఆస్పత్రికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రుయా అధికారులు, డాక్టర్లు లక్ష్మీపతిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మానాయక్, హెచ్‌వోడీ డాక్టర్ సుబ్బారావు, ఏడీ రత్నరాజు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, సిబ్బంది రాజా, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 15: గోవిందరాజ స్వామి ఆలయంలో ఈనెల 17వ నుంచి తెప్పోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో రోజూ సాయంత్రం 6.30నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్కరణిలో వివిధ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొంది.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, ఎమ్మెల్సీలు రఘువర్మ, కల్యాణ్ చక్రవర్తి, టీటీడీ మాజీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

19న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 15 : పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ హోం అఫైర్స్ బృందం ఈ నెల 19వ తేదీన జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. కమిటీ రాక సందర్భంగా ఏర్పాట్లు చూడాలని ఆయన కలెక్టరేట్‌లో సోమవారం అధికారులను ఆదేశించారు. 30మందితో కూడిన రాజ్యసభ, లోక్‌సభ సభ్యుల బృందం తిరుమల శ్రీవారి ఆలయంలో విపత్తు నిర్వహణపై అధ్యయనం చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జేసీ శుభం బన్సల్, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, డీఆర్వో పెంచలకిషోర్, ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, రామమోహన్, డీఎఫ్‌వో రమణయ్య, డీఎంహెచ్‌వో శ్రీహరి, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి ఆదినారాయణరెడ్డి, డీఐపీఆర్వో బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది అంటేనే బీజేపీకి పట్టదు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 15: దక్షిణాది రాష్ట్రాలంటేనే కేంద్రంలోని బీజేపీకి చిన్నచూపని, అందులోనూ వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి చేస్తామని మాటల్లో చెబుతారు తప్పా నిధులు ఇచ్చిన పాపాన పోలేదని ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కూరపాటి సురేష్‌బాబు విమర్శించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రం రాయలసీమ పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతోందని, అందుకే అనంతపురం జిల్లా ఎడారిగా మారిపోయిందని అన్నారు. రాయలసీమ నుంచి ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు కూడా న్యాయం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాయలసీమ ప్రాంతానికి కృష్ణా నికర జలాలు అందించే రాజకీయ పార్టీకే మద్దతు ఇవ్వాలని కోరారు. నీరు, సరైన పనిలేక యువతీ యువకులు పక్క రాష్ట్రాలకు వలసబాట పడుతున్నారని తెలిపారు. సమితి నాయకులు అబ్దుల్ రఫీ, నరేష్, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

ఎన్ఎంఆర్‌లతో అభినయ్ భేటీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 15: ఎస్వీ యూనివర్సిటీ ఎన్ఎంఆర్‌లకు వేతనాల పెంపునకు కృషి చేస్తానని తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని శ్రీనివాసా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎస్వీయూ ఎన్ఎంఆర్ ఉద్యోగులతో గురువారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అభినయ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యోగ భద్రత కోసం తోడ్పడతానని తెలిపారు. అంతకుముందు వేతనాల పెంపునకు కృషి చేస్తానన్నారు. తన కోసం గంట కేటాయిస్తే, మీ కోసం ఐదేళ్లు పనిచేస్తానని అన్నారు. వారసత్వాన్ని చూసి కాదనీ, అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని అభినయరెడ్డి కోరారు.

శ్రీవారిని దర్శించుకున్న ఝార్ఖండ్ గవర్నర్

తిరుమల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం తిరుమలకు చేరుకున్న ఆయన రాత్రి నైవేద్య విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

తోట ప్రహరీ, అలంకార మండపానికి శంకుస్థాపన

చంద్రగిరి, ఫిబ్రవరి 15: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో గురువారం తోట ప్రహరీ, అలంకార మండపానికి శంకుస్థాపన చేశారు. ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి,దేవదాయశాఖ జిల్లా అధికారి పుట్టా రామకృష్ణారెడ్డి, ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, సర్పంచ్ రూపారామ్మూర్తి, మార్కెటింగ్ వైస్‌ఛైర్మన్ చేగు గోవర్ధన్‌గుప్తా, పాలకమండలి సభ్యులు , చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

తిరుచానూరు, ఫిబ్రవరి 15: మహిళలు స్వయంశక్తితో ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ జ్యోతి అన్నారు. తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో గురువారం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా టైలరింగ్ శిక్షణ పూర్తిచేసుకున్నా వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కోర్సులు (ఎల్ఎంవీ డ్రైవింగ్, బ్యూటీషియన్, టైలరింగ్) కోర్సులు మహిళా ప్రాంగణం జిల్లా మేనేజరు పర్హాన ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రతాప్‌రెడ్డి, లోకనాథరెడ్డి పాల్గొన్నారు.



ప్రేక్షకులను బయటకు రావాలని ఆదేశిస్తున్న పోలీసులు

'రాజధాని ఫైల్స్' సగంలో ఆపేస్తారా?

తిరుపతి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి) : రాజధాని ఫైల్స్ సినిమా నడుస్తుండగా ఆపేశారు. తిరుపతిలోని జయశ్యామ్ థియేటర్లోకి పోలీసులు, రెవెన్యూ అధికారులు గురువారం హుటాహుటిన చేరుకున్నారు. అప్పుడే ఇంటర్వెల్ కార్డు పడింది. పాప్‌కార్న్ కోసం బయటకు వచ్చిన ప్రేక్షకులు 'షో' ఆపండంటూ థియేటర్ సిబ్బందితో పోలీసులు వాగ్వివాదం చేస్తుండడం చూసి విస్తుపోయారు. ఎందుకు ఆపుతున్నారు? అని ఆరా తీస్తే...హైకోర్టు స్టే ఇచ్చిన కారణంగా ప్రదర్శన నిలిపివేస్తున్నట్టు పోలీసులు చెప్పడంతో ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'యాత్ర, వ్యూహం సినిమాలను ఇలాగే ఆపుతారా?' అంటూ ప్రశ్నించారు. టికెట్ డబ్బులు ఎవరిస్తారంటూ మండిపడ్డారు. స్టేఆర్డర్ కాపీ చూపించాలని పలువురు ప్రేక్షకులు ప్రశ్నించగా పోలీసులు నీళ్లు నమిలారు. ఇంతలో వాట్సప్ ద్వారా తెప్పించుకుని థియేటర్ సిబ్బందికి చూపించారు. దీంతో చేసేదేమిలేక మధ్యలోనే సినిమా నిలిపివేశారు.

17న స్టాటిస్టికల్ డేటా సైన్స్ సెంటరు ప్రారంభం

తిరుపతి (తిలక్‌రోడ్), ఫిబ్రవరి 15 : తిరుపతిలో ఈ నెల 17న ఇండియన్ సొసైటీ ఫర్ ప్రొబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ డేటా సైన్స్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు ఇండియన్ సొసైటీ ఫర్ ప్రొబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ గౌరవాధ్యక్షుడు ప్రొఫెసర్ పి.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం ద్వారా ఉత్తీర్ణులైన విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో ఉంటూ వాటి ప్రాధాన్యత ఉన్న విద్యాస్థానాల్లో బోధిస్తున్నారన్నారు. టీటీడీలో భక్తులకు సుదర్శనం టోకెన్లు, మూడులైన్ల ప్రతిపాదన అమలు వంటివి ఇండియన్ సొసైటీ ఫర్ ప్రొబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ ద్వారానే జరుగుతున్నాయన్నారు. నిరుద్యోగ యువతకు మంచి భవిష్యత్తు అందించాలనే దృఢ సంకల్పంతో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

నేడు వామపక్షాల బంద్

తిరుపతి (కొర్లగుంట), ఫిబ్రవరి 15: పారిశ్రామిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు కోరాయి. ఈ మేరకు సంఘాల నాయకులు గురువారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. పంచముఖ అంజనేయస్వామి ఆలయం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. చిన్నబజారు వీధి, పాత మెటర్నిటీ హాస్పిటల్, భవానీనగర్, వీవీమహల్, తిలక్‌రోడ్డు, రైల్వేస్టేషన్, కర్నాలవీధి, రాయలచెరువురోడ్డు, బైరాగిపట్టెడ మీదుగా సీపీఐ కార్యాలయం వరకు సాగింది. వారు మాట్లాడుతూ శుక్రవారం నిర్వహించే బంద్‌లో నగరవాసులు, వ్యాపారులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎస్.డి.రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు శివారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ, శ్రీరాములు, శివకుమార్, శివగోవింద స్వామి, శ్రీనివాసులు, ఎల్.కె.నాయుడు, బాల, ప్రమీల, రాము, పద్మనాభరెడ్డి, చలపతి, రవి, రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేయాలి

చంద్రగిరి, ఫిబ్రవరి15: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి ప్రణాళికపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీలలో ప్రజాప్రతినిధులు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలో త్వరలోనే అధికారులకు నివేదికలు ఇస్తే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ శశిరేఖ, ఏవో రవిచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేటమిట్టలో కోదండరాముడి విగ్రహ ప్రతిష్ఠ

కుంభాభిషేకంలో భాగంగా కలశానికి అభిషేకం



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు - ఆలయ ప్రాంగణం



దేవతామూర్తుల విగ్రహాలు

- కమనీయంగా సీతారాముల కల్యాణం
- ముగిసిన కుంభాభిషేక మహోత్సవాలు

పూతలపట్టు, ఫిబ్రవరి 15: పూతలపట్టు మండలం పేటమిట్టలో గురువారం కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకాన్ని భక్తజనరంజకంగా నిర్వహించారు. దీంతో నాలుగు రోజులుగా జరుగుతున్న మహోత్సవాలు ముగిశాయి. తమ స్వగ్రామంలో ఒకే ప్రాంగణంలో విరూపాక్షమ్మ ఆలయంతో పాటు కోట్లాది రూపాయలు వెచ్చించి కోదండరామస్వామి ఆలయాన్ని అమరరాజా సంస్థల అధినేత డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు నిర్మించారు. ఈనెల 12న విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు మొదలయ్యాయి. నాలుగో రోజైన గురువారం ఉదయం 4 నుంచి 5 గంటల మధ్య కోదండరామస్వామి, సీతా మహాదేవి, లక్ష్మణ స్వామి, దాసాంజనేయస్వామి విగ్రహాలను వేద పండితులు ప్రతిష్ఠించారు. నేత్ర బంధనం, అఖండ దీపస్థాపనం, కవాటబంధనం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. 8 గంటల నుంచి గోపూజ, విశేష వాహనాలు, ప్రధాన కలశాల స్థాపన, శోభాయాత్రను జరిపి, 9.15 గంటలకు సమస్త ప్రతిష్ఠ దేవతామూర్తులకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. పూర్ణాహుతితో ఈ మహోత్సవాలు ముగిశాయి. ఉదయం 10.30 గంటలకు గల్లా జయదేవ్ దంపతులు, గల్లా రామచంద్రనాయుడు దంపతులు, గౌరినేని రమాదేవి దంపతుల చేతులమీదుగా సీతారామకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఆయా కార్యక్రమాల్లో గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి, గౌరినేని ప్రసాద్, గౌరినేని రమాదేవి, గౌరినేని హర్షవర్ధన్, గౌరినేని విక్రమ్, గల్లా అశోక్, గల్లా సిద్ధార్థ, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, ఎస్వీ నాయుడు, టీడీపీ నాయకులు టీడీ జనార్దన్, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, యువరాజులు నాయుడు, గంగారపు గోపి, దొరబాబు చౌదరి, స్థానిక సర్పంచ్ గల్లా రాధాకృష్ణమ నాయుడు, గల్లా రాజశేఖర్ నాయుడు, భానుమూర్తి నాయుడు, గల్లా రామానాయుడు, సంపత్ నాయుడు, పీఆర్వోలు బాబ్జీ, పద్మనాభ చౌదరితో పాటు గల్లా కుటుంబీకులు, చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.



పూజాకార్యక్రమాల్లో పాల్గొన్న గల్లా కుటుంబీకులు



ఆలయంలో సుపథ మండపానికి రంగులు వేస్తున్న కార్మికులు

జోరుగా మహాశివరాత్రి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ముక్కంటి ఆలయంలో 14రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగే విష యం తెలిసిందే. మరో రెండు వారాల్లో జంగమయ్య పండుగ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆలయంలో రంగులు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రెండు రథాల పటిష్ఠతపై అధ్యయనం చేశారు. ఇక ఆలయం, పట్టణ మాడవీధుల్లో విద్యుత్ దీపాలంకరణ పనులు సాగుతున్నాయి.

సేవతోనే ఆత్మసంతృప్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: సేవతోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. శ్రీకాళహస్తిలోని పూసల వీధికి చెందిన బాషా గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం 40 రకాల అత్యవసర సరుకులను అందజేశారు. బాలాజీ, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

25న తిరుపతికి తెలంగాణ, కర్ణాటక సీఎంల రాక

- ఎస్వీయూ స్టేడియంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- వీసీ అనుమతి కోరిన కాంగ్రెస్ స్థానిక నాయకత్వం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 15: ఈ నెల 25వ తేదీన తిరుపతికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రానున్నారు. ఎస్వీ యూనివర్సిటీ పరిధిలోని తారకరామా స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారు. ఈ సభకు తారకరామా స్టేడియం కేటాయించాలని కోరుతూ ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డికి స్థానిక కాంగ్రెస్ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, అన్నమయ్య జిల్లా కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు పూతలపట్టు ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

వాకాడు, ఫిబ్రవరి 15: ఓ వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పూడిరాయదొరువు పంచాయతీ ఓడపాళెం గ్రామం సమీపంలో ఉన్న చవకచెట్లలో గోను చెంగమ్మ (65) ఉరేసుకున్నారు. ఈమె స్వస్థలం చిట్టమూరు మండలం చిట్టమూరు హరిజనవాడగా గుర్తించారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొన్న బస్సు

ఆటోడ్రైవర్ దుర్మరణం, మరొకరికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన ఆటో (ఇన్‌సెట్లో) మృతి చెందిన ఆటో డ్రైవర్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 15: ఆటోను బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. తనియాలికి చెందిన ఆటోలో డ్రైవర్ నేలనూరు వెంకటేశ్వర్లు (43)తో కలిసి పల్లూరు వీరాస్వామి దొరవారి సత్రం నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. గురువారం తెల్లవారు జామున మావిళ్లపాడు క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపైకి వచ్చేసరికి చెన్నై నుంచి హైదరాబాదుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఆటోడ్రైవర్ ఆటో కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలోని వీరాస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారు బస్సును స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తిని ప్రాథమిక చికిత్స చేశాక మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు.

9వ బెటాలియన్‌లో డీఐజీ తనిఖీలు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని 9వ బెటాలియన్‌ను ఏపీఎస్పీ డీఐజీ రాజకుమారి గురువారం తనిఖీ చేశారు. సమస్యలను ఆరాతీసి, పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ప్రకాష్, అడిషినల్ కమాండెంట్ అరుణ్ బోస్, అసిస్టెంట్ కమాండెంట్ ఎమ్మెల్ మనోహర్, ఆనంద్ కన్నా, రామకృష్ణ, ఏవో చంద్రమౌళి, డాక్టర్ శేసమ్మ, కిరణ్‌ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం



గురవరాజుపల్లిలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి15: వైసీపీ ప్రభుత్వంలోనే గ్రామాభివృద్ధి సాధ్యమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన గుత్తివారిపల్లిలో సచివాలయం, వెదుళ్లచెరువులో రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేశారు. అనంతరం గురవరాజుపల్లిలో సచివాలయం, కరకంబాడిలో సచివాలయం-2, వెల్‌నెస్ సెంటర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గణేష్‌రెడ్డి, సర్పంచ్‌లు మంజుల, షహనాజ్‌బీ, ఈశ్వరమ్మ, శోభలు,నాయకులు గంగారి రమేష్, బాబ్జిరెడ్డి, రహీమ్, ఇర్ఫాన్, శంకర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చెంగయ్య, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

వలంటీర్లకు అభినందన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: ప్రశంసా పత్రాలు అందుకున్న ఇద్దరు వలంటీర్లను ఘనంగా అభినందించారు. తిరుపతిలో జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ వార్డు వలంటీర్స్ అప్రిషియేషన్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని తులసి, షారుక్‌ఖాన్ గురువారం ప్రశంసా పత్రాలు అందుకున్నారు. వారిని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, సిబ్బంది అభినందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: తిరుపతికి చెందిన విజయ్ (28) అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తిరుపతి గాంధీ రోడ్డుకు చెందన విజయ్ ఎంబీఏ పూర్తి చేశాడు. మనస్తాపంతో ఎలుకల మందు సేవించాడు. తర్వాత తిరుపతి నుంచి ఆర్టీసీ బస్సులో శ్రీకాళహస్తికి చేరుకున్నాడు. బస్టాండ్‌లో మళ్లీ చేయికోసుకునే ప్రయత్నం చేశాడు. స్థానికులు అడ్డుకోవడంతో తర్వాత అతడే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు. శ్రీకాళహస్తిలో పట్టణ పోలీసులు ఆస్పతికి చేరుకున్నారు. యువకుడి కుటుంబ వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

మరణించి.. ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపి

రుయాస్పత్రిలో బ్రెయిన్ డెడ్‌కు గురైన మహిళ ● రెండు కళ్లు రుయాస్పత్రికి, కిడ్నీలు స్విమ్స్‌కు దానం



బ్రెయిన్ డెడ్‌కు గురైన హరిత

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 15 : రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన దెబ్బ తగిలి రెండు రోజులుగా స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న మహిళ చివరకు బ్రెయిన్ డెడ్ అయింది. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె కళ్లను రుయాస్పత్రికి, కిడ్నీలను స్విమ్స్‌కు దానం చేశారు. రామచంద్రాపురం మండలం కమ్మపల్లికి చెందిన బొల్లిపల్లి హరిత (36) తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తోంది. ఈ నెల 12న కమ్మపల్లి నుంచి తెలిసిన వారి ద్విచక్ర వాహనంపై తిరుపతికి వస్తూ రోడ్డు ప్రమాదానికి గురైంది. తలకు బలమైన గాయం తగలడంతో వెంటనే స్విమ్స్‌కు తీసుకువచ్చారు. చికిత్స అందించినా బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు చెప్పి అవయవదానం గురించి వివరించారు. మొదట్లో వారు నిరాకరించారు. వారికి సన్నిహితంగా ఉండే రుయాస్పత్రి వర్కింగ్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నబాబు, నీలకంఠ చౌదరి అవయవదానం గురించి వివరించి, ఒప్పించారు. ఆమె గుండె, లివర్ అప్పటికే పనికిరాకపోవడంతో కళ్లు,కిడ్నీలను మాత్రమే సేకరించారు. కళ్లను రుయాస్పత్రి ఐ బ్యాంక్‌కు తరలించారు. వాటిని హైదరాబాదులోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలిస్తామని వైద్యులు తెలిపారు. కిడ్నీల్లో ఒకటి నెల్లూరుకు పంపగా మరొకటి స్విమ్స్‌లోనే మరో వ్యక్తికి అమర్చినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మహిళ మృతదేహాన్ని స్విమ్స్ అధికారులు స్వగ్రామానికి తీసుకువెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అవయవాలు దానం చేసిన ధ్రువీకరణ పత్రాన్ని వారికి అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హరిత భర్త మురళి ఏడాది కిందట అనారోగ్యంతో మృతిచెందడం, ఇప్పుడు ఆమె రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో పదో తరగతి చదువుతున్న వారి కుమారుడు, ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్తె దిక్కులేని వారయ్యారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు కోరారు.



అవయవదానానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేస్తున్న చిన్నబాబు

స్టైఫండ్ కోసం జూనియర్ డాక్టర్ల నిరసన

- రోజంతా రుయాస్పత్రి ముందు ఆందోళన

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 15 : ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్‌ను తక్షణమే చెల్లించాలని కోరుతూ రుయాస్పత్రిలోని జూడా(జూనియర్ డాక్టర్లు)లు గురువారం ఆస్పత్రి కార్యాలయ భవనం ముందు నిరసనకు దిగారు. వారు మాట్లాడుతూ ఎస్వీ వైద్య కళాశాల పరిధిలో చదువుకుంటూ రుయాస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న 200 మంది జూనియర్ డాక్టర్లకు గత ఏడాది అక్టోబరు నుంచి స్టైఫండ్ ఇవ్వలేదన్నారు. ఒక్కొక్కరికి రూ.లక్షకు పైగా స్టైఫండ్ రావాల్సి ఉందని తెలిపారు. హెచ్‌వోడీలను అడిగితే మీరు సకాలంలో డ్యూటీ సర్టిఫికెట్స్ అందించకపోవడం వల్లే బిల్లులు పెట్టేందుకు వీలు పడలేదని, ప్రస్తుతం గత ఏడాదికి సంబంధించిన స్టైఫండ్ విడుదల చేసే అవకాశం లేదని, గడిచిన రెండు నెలలకు మాత్రమే అందించే అవకాశం ఉందని చెబుతున్నారని వాపోయారు. తమ విధులకు సంబంధించిన రికార్డుల పూర్తి బాధ్యత హెచ్‌వోడీలే చూసుకుంటారని, ఇప్పుడు మాత్రం దాటవేత ధోరణి అవలంబించడం అన్యాయమని పేర్కొన్నారు. ఐదు నెలల స్టైఫండ్ చెల్లించకపోతే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని వారం కిందటే కళాశాల ప్రిన్సిపాల్, రుయాస్పత్రి సూపరింటెండెంట్ల దృష్టికి తెచ్చామని, వారు స్పందించకపోవడంతో నిరసనకు దిగాల్సి వచ్చిందని అన్నారు. ప్రస్తుతం రోగులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా కొంతమంది విధులు కొనసాగిస్తున్నారని, సమస్య పరిష్కరించకపోతే పూర్తి స్థాయిలో సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. చివరకు కలెక్టర్ లక్ష్మీశా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



రుయాస్పత్రి ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు



జూనియర్ డాక్టర్లతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



గిరిధర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, ఫిబ్రవరి 15: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలోని చుట్టుగుంట ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపినవివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెద్దకాకాని గ్రామానికి చెందిన గిరిధర్ రెడ్డి(22) మూడేళ్లుగా సూళ్లూరుపేటలోని శ్రీసిటీలో పనిచేస్తున్నాడు. స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేటనుంచి బయల్దేరగాచుట్టుగుంట వద్ద కొచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గిరిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

43 మద్యం బాటిళ్ల స్వాధీనం: ఒకరి అరెస్టు

గూడూరు, ఫిబ్రవరి 15: మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఓ వ్యక్తిని రైల్వే జీఆర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రైల్వేజీఆర్‌పీ ఎస్‌ఐ కొండప్పనాయుడు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన కృష్ణ అనే వ్యక్తి బెంగుళూరు నుంచి రూ.20వేల విలువ చేసే 43 మద్యం బాటిళ్లను శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో నెల్లూరుకు తరలిస్తున్నాడు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంపై రైలు నుంచి దిగగా అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

సినీ ఫక్కీలో రూ.15వేల అపహరణ

కోట, ఫిబ్రవరి 15: విద్యానగర్‌లో గురువారం సినీ ఫక్కీలో ఓ మహిళ వద్ద రూ.15వేలను అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వాకాడు మండలం గంగన్నపాళెంకు చెందిన పున్నూరు నాగరాజమ్మ విద్యానగర్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో ఇంటి రుణానికి సంబంధించి రూ.15వేలను ఈఎంఐగా చెల్లించడానికి ఓ బ్యాగులో పెట్టుకుని బస్సుదిగారు. బ్యాంకు వైపునకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి ఓ ద్విచక్ర వాహనంలోవచ్చి సినీ ఫక్కీలో బ్యాగును లాక్కెళ్లిపోయాడు. బాధితురాలు తేరుకుని, స్థానికులు వచ్చేలోపే పరారయ్యాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ నాగబాబు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు.

చెంగాళమ్మ సేవలో కమ్యూనికేషన్ డీఐజీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 15: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం కమ్యూనికేషన్ డీఐజీ ఎస్ఎస్‌జే లక్ష్మి కుటుంబ సభ్యులతో దర్శించుకొన్నారు. వీరికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ ఎస్ఎస్‌జే లక్ష్మికి ప్రసాదాలు అందజేస్తున్న సిబ్బంది →



పుత్తూరు వార్తలు

9న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 15: వీలైనన్ని ఎక్కువ ప్రీలిటిగేషన్ కేసులను రాజీ చేసి.. మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పిలుపునిచ్చారు. గురువారం సబ్‌కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీకి లోబడే క్రిమినల్, సివిల్ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు న్యాయవాదులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. కక్షిదారులకు లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించాలని సూచించారు. న్యాయవాదుల సంఘం సెక్రటరీ మురుగేషన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పురుషోత్తం, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేటి బంద్‌ను జయప్రదం చేయండి: సీఐటీయూ



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా శుక్రవారం జరగనున్న బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నుంచి ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ.. రెండోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. నాయకులు పురుషోత్తం, విజయ్, రామలింగం, సురేష్, శివ, రాము పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దళితులకు ఒరిగింది శూన్యం

గాలి భానుప్రకాష్ ధ్వజం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 15: వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులకు ఒరిగింది శూన్యమని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ధ్వజమెత్తారు. గురువారం మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడు ఆనంగి చీరాల తిరుపతిలో భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ.. దళితుల అభివృద్ధి కోసం నిర్దేశించిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి.. ఆ వర్గాలను వైసీపీ ప్రభుత్వం ఆర్థికంగా, సామాజికంగా అణగదొక్కిందని ఆరోపించారు. వైసీపీ పాలనలోనే అత్యధికంగా దళితులపై దాడులు జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. నగరి నియోజకవర్గం నుంచి రెండు దఫాలు వైసీపీ గెలిచిన పాపానికి మరో 50 ఏళ్ల అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. నగరి నుంచి వైసీపీని తరిమికొట్టేందుకు కలిసి వచ్చే ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌ను ఆనంగి చీరాల, ఆనంగి పెద్దబ్బ, మునికుమార్ సత్కరించారు.



గాలి భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న ఆనంగి చీరాల తదితరులు

ఉద్యోగుల సమస్యలపై స్పందించని ప్రభుత్వం



నినాదాలు చేస్తున్నఉద్యోగులు

వడమాలపేట, ఫిబ్రవరి 15: ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వంలో స్పందన లేదని పుత్తూరు తాలూకా ఏపీజేఏసీ అధ్యక్షుడు గిరి ఆరోపించారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల వద్ద గురువారం మధ్యాహ్నం భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలు ధరించి.. నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీలో భాగంగా 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలని, వేలాది కోట్ల రూపాయలు బకాయిలను తక్షణమే చెలించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పాత ఓపీఎస్ విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైటైర్మెంట్ బెనిఫిట్లను వెంటనే అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా అసోసియేట్ ప్రెసిడెంట్ లోకనాథం, జాయింట్ సెక్రటరీ కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

షాదీ మహల్ ప్రారంభం



షాదీ మహల్‌ను ప్రారంభించిన మంత్రులు, డిప్యూటీ స్పీకర్

పుత్తూరు, ఫిబ్రవరి 15: పుత్తూరు పట్టణంలో రూ.2.41 కోట్లతో నిర్మించిన షాదీ మహల్‌ను గురువారం మంత్రి రోజా, ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా, శాసన మండలి డిప్యూటీ స్పీకర్ జకియా ఖానం ప్రారంభించారు. తొలుత పున్నమి సర్కిల్ వద్ద వైఎస్‌ఆర్ విగ్రహానికి, తర్వాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం పున్నమి సర్కిల్ నుంచి మోటార్ బైక్ ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ హరి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ మాహీన్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పంటల సాగుపై శిక్షణ

వడమాలపేట, ఫిబ్రవరి 15: స్వర్ణ భారత్ సాధనలో దేశానికి రైతాంగం వెన్నెముక అని తిరుపతి ఆకాశవాణి చీఫ్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం కిసాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా వడమాలపేటలో రైతులకు పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈక్రాప్, పీఎం కిసాన్ పథకాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల కృష్ణారెడ్డి, రెడ్డిరాము, ఆకాశవాణి అధికారులు బాలసుబ్రమణ్యం, దండపాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వేణుగోపాల్ రెడ్డి

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఈ-క్రాప్ నమోదుతో రైతులకు లబ్ధి


నాగంపల్లి వద్ద వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఏర్పేడు, ఫిబ్రవరి 15: ఈక్రాప్ నమోదు రైతులకు లబ్ధి చేకూరుతుందని తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఏర్పేడు మండలంలోని నచ్చనేరి, నాగంపల్లి, అంజిమేడు గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఈ - పంటను నమోదు చేసుకునన రైతుల పొలా లను పరిశీలించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లా డుతూ ఈ క్రాప్ నమోదు చేసుకోవడం వల్ల వరద ప్రభావంతో పంట నష్టపోతే రైతులకు ప్రభుత్వం పరిహారమందిస్తుందని చెప్పారు. దీనికి తోడు ఇన్సూరెన్సు అందుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రసాద్‌రావు, శ్రీకాళహస్తి డివిజన్ ఏడీఏ రమేష్‌రెడ్డి, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ షణ్ముగం, వీఏవే భాగ్యలక్ష్మి, ఎంపీఈవో సౌమ్య, ఏఈవో ప్రదీప్, నచ్చనేరి వీఆర్వో, అంజిమేడు వీఆర్వో, సర్వేయర్లు, ఆర్ఐ సంతోష్ పాల్గొన్నారు.

గిడ్డంగుల వద్ద కలెక్టర్ తనిఖీలు

రేణిగుంట, ఫిబ్రవరి15: రేణిగుంట సమీపంలో ఎఫ్‌సీఐ గిడ్డంగుల ప్రాంగణంలో ఈవీఎంలు భద్రపరచిన గిడ్డంగులను గురువారం కలెక్టర్ జి.లక్ష్మీశ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పటిష్టమైన భద్రత కొనసాగాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మనోహర్ ఆచారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిరంజీవి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వీకేఆర్‌పై కాలనీలో అర్ధరాత్రి అక్రమ కట్టడాలు



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 15: చిన్నపాండూరు పంచాయతీలోని వీకేఆర్‌పై కాలనీ చెరివిరోడ్డులో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. గతంలో పలువురు ఇళ్ల నిర్మాణాలు చేప ట్టారు. అంబేడ్కర్ భవన నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రం, పేరంటాలమ్మ ఆలయం, వాటర్ ట్యాంకుకు సంబంధించిన ఎకరా స్థలం ఇప్పటికే కబ్జాకు గురైంది. తాజాగా పాండూరుకు చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వీఆర్‌ఏ వెంటనే అక్కడికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో చేపట్టిన పనులను అడ్డుకున్నారు. అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఉదయభారతి హెచ్చరించారు.

ముక్కంటి ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ


ఈవో నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా ఎస్వీ నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో ఆయన గురువారం ముందుగా స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. అనంతరం కేఎస్ రామారావు నుంచి ఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పూర్వ ఈవో రామారావు మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ఆలయ ఉద్యోగులందరూ ఎంతగానో సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు.

గోపురం కలశాల వితరణ


దాతను సత్కరిస్తున్న ఆలయ చైర్మన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణా కేంద్రంలోని శివాలయ గోపురానికి నాలుగు ఇత్తడి కలశాలను వితరణ చేశారు. పట్టణం లోని వీఎంపల్లికి చెందిన పసల కుమార్ రూ.22 వేలు విలువచేసే కలశాలను తయారు చేయించారు. గురువారం ఆలయ కుంబాభిషేకం పురస్కరించుకుని ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేశారు. అనంతరం దాతను ఘనంగా సత్కరించారు.

ఇంటి పన్నులు వసూలు చేయండి

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 15: వరదయ్యపాళెం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సూళ్లూరుపేట డీఎల్‌పీవో రవీంద్రబాబు ఆధ్వర్యంలో ఇంటి పన్నులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులందరూ ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేసి మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఏవో శర్మ, ఈవోపీఆర్డీ చిరంజీవి, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల కుటుంబాన్ని ఆశీర్వదించండి



ఏర్పేడు, ఫిబ్రవరి 15: వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని టీడీపీ శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామంలో గురువారం 'ఇంటింటికీ బొజ్జల' కార్యక్రమాన్ని నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధనంజయులనాయుడు, గుణ యాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం, ర మణారెడ్డి, రమణయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులను సన్మానించిన హెలెన్



నాగలా పురం, ఫిబ్రవరి 15: నాగలాపురం పడ మటి దళిత వాడకు చెందిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా కారులు సుమన్, సతీష్‌లను సత్యవేడు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి హెలెన్ గురువారం ఘనంగా సన్మానించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా కొత్తపాళెంలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో తిరు పతి జిల్లా తరపున వీరు పాల్గొన్నారు. జట్టు రన్నర్స్‌గా నిలవడంతో కీలకంగా వ్యవహించారు. ఈ క్రమంలో వారి ఇళ్లకు వెళ్లి శాలువలతో సన్మానించారు. అంతకుముందు అక్కడి అంబేడ్కర్ విగ్రహానికి పూమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, మాజీ ఎంపీపీ మురళి, నాయకులు ఎండీ కుమార్, నెల్సన్‌మండేలా, రుద్రయ్య, రాజశేఖర్‌యాదవ్, తిరుపతి, దేవానందం, షణ్ము గాచ్చారి, పురుషోత్తం, వెంకటేష్, భరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి : టీడీపీ


టీడీపీ అమలుచేయబోయే పథకాల వివరాలు ప్రదర్శిస్తున్న ఏపీ వారియర్స్ సభ్యులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: యువశక్తి పైనే రాష్ట్ర భవితవ్యం ఆధారపడి ఉందని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఏపీ వారియర్స్ బృందం సభ్యులు అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం బృందం సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రం తిరిగి కోలుకోవాలంటే సంపద సృష్టికి మారుపేరైన చంద్రబాబును గెలిపించుకోవాలన్నారు. యువత ఉద్యోగం సాధించేవరకు వరకు నిరుద్యోగ భృతి ఇస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు యు వత అధ్యక్షులు కృష్ణయాదవ్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు కృష్ణవేణి, నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: ముక్కంటి ఆలయంలో వెలసిన గురుదక్షిణామూర్తి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం పురస్కరించుకొని అర్చకులు ముందుగా గురుదక్షిణా మూర్తి సన్నిధిని శుద్ధి చేశారు. శాస్త్రోక్తంగా కలశస్థాపన చేసి భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచాలంకృతంగా అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు. వేదమంత్రాలు, మధ్య ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

మాతమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తిలోని ఎంఎం వాడలో వెలసిన మాతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం కొలుపు ఉత్సవం జరిగింది. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక, అభిషేకాలు పూజలు నిర్వహించారు.

వరదయ్యపాళెం ఏపీవోగా కృష్ణయ్య



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 15: ఉపాధిహామీ పథకం ఏపీవోగా కృష్ణయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. సత్యవేడు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా గత ఏపీవో అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయ్యారు.

కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని శ్రీనివాసతేజ పాఠశాలలో విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గ్రామీణ బంద్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తిలో శుక్రవారం గ్రామీణ బంద్ నిర్వహించనున్నట్లు సీపీఐ శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య తెలిపారు. ఈ మేరకు దేశవ్యాప్త గ్రామీణ బంద్ ఆవశ్యకతపై గురువారం పట్టణంలో కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రథసప్తమి పురస్కరిం చుకుని విశేష పూజలు నిర్వహించనున్నట్లు అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆలయ మూడవ ద్వారం వద్ద వెలసిన ఛాయా ఉషాదేవి సమేత సూర్య నారాయణ స్వామి సన్నిధిలో విశేష పూజలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం 6గంటలకు కలశ స్థాపన, సంకల్పం పూజలు అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం ధూప దీప నైవేద్య హారతులను సమర్పిస్తారు. ఆతర్వాత స్వామివారి ఉత్సవ మూర్తి సూర్యప్రభ వాహనంపై, అమ్మవారు చప్పరం వాహనంపై చతుర్మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు.

రెండవ పట్టణ సీఐగా రారాజు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసు స్టేషన్ సీఐగా రారాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన మల్లికార్జున్ రేణిగుంటకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

పంచాయతీ దుకాణాల వేలం

ఏర్పేడు, ఫిబ్రవరి 15: ఏర్పేడు గ్రామ పంచాయతీ దుకాణాల గదులకు వేలం పాటను గురువారం నిర్వహించారు. పంచాతీ కార్యాలయంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివయ్య అధ్యక్షతన, ఈవోపీఆర్డీ రమణకుమార్ ఆధ్వర్యంలో వేలంపాటు జరిగాయి. మొత్తం 31 గదులు ఉండగా 24గదులకు వేలం పాటను నిర్వహించారు. మార్కెట్, సంతకు వేలం పాటలు జరిగాయి. ఈ వేలం ద్వారా పంచాయతీకి రూ.62,11,106 ఆదాయం సమకూరింది. కాగా 2, 3, 24, 25, 26, 27, 18 గదులకు వేలం వాయిదా పడింది.

పాతవీరాపురంలో ఎన్నికల ప్రచారం

ఏర్పేడు, ఫిబ్రవరి 15: ఏర్పేడు మండలం పాతవీరాపురం పంచాయతీ దళితవాడ, గిరిజనకాలనీ గ్రామంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అంతా నా ఇష్టం..!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15 : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఓ ఒప్పంద ఉద్యోగి 10 నెలల పాటు అనధికారికంగా విధులకు గైరహాజరయ్యారు. తనకు ఇష్టం వచ్చినప్పుడు విధులకు వస్తానంటూ చెప్పుకునే ఆయన అదే ప్రకారం తిరిగి దర్జాగా కొలువులో చేరాడు. ముక్కంటి ఆలయంలో క్యూలైన్లను జరిపే విధులు నిర్వహించేందుకు కొద్ది సంవత్సరాల క్రితం ఓ ఒప్పంద ఉద్యోగి చేరాడు. ఆ తర్వాత తన రాజకీయ అండతో ఆలయంలోని పీఆర్‌వో కార్యాలయంలో తిష్టవేశాడు. ఆదాయ స్థావరంలో మాత్రమే విధులు నిర్వహిస్తానని తనను అంతర్గతంగా మరో విభాగానికి బదిలీ చేస్తే పనిచేయనంటూ పలువురు అధికారులపై ఎదురు తిరిగేవాడు. పది నెలల క్రితం ఆయనను వీఆర్వో కార్యాలయం నుంచి దుకాణాల అద్దె వసూలు చేసే విభాగానికి అంతర్గతంగా బదిలీ చేశారు. అయితే అద్దె వసూలు చేసే విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని పలువురు సహచర ఉద్యోగుల వద్ద పెదవిరిచాడు. ఆ ప్రకారమే ఆలయంలో ఒక్కరోజు కూడా విధులకు హాజరు కాలేదు.

ఇటీవల రెండు రోజులు పాటు అధికార పార్టీ నాయకులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో ప్రత్యక్షమయ్యాడు. ఇక అంతే కనీస అనుమతులు లేకుండా 10 నెలలపాటు విధులకు దుమ్మా కొట్టిన ఒప్పంద ఉద్యోగికి తిరిగి మళ్లీ విధులు కేటాయించారు. దీనిపై ఆలయంలో పెద్దఎత్తున అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

విధ్వంస పాలనకు చరమగీతం : పురంధేశ్వరి


మీడియాతో మాట్లాడుతున్న పురంధేశ్వరి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: వైసీపీ విధ్వంస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. నెల్లూరు పర్యటన కోసం విచ్చేసిన ఆమెకి శ్రీకాళహస్తి ఏపీ సీడ్స్ కూడలి వద్ద బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అప్పుల్లో కూరుకుపోయి ప్రజలపై తీవ్ర భారం మోపుతోందన్నారు. అవినీతి లేని, వారసత్వ రహిత పాలన సాగించే బీజేపీని ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పొత్తుల అంశం అధిష్టానం పరిధిలో ఉంటుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, పట్టణ అధ్యక్షుడు రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం


నీలకంఠేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేకంలో కలశ జలాలను తీసుకెళుతున్న అర్చకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న నాలుగు ఆలయాల్లో గురువారం మహాకుంభాభిషేకం నిర్వహించారు. మూడు రోజుల ముందు నుంచే కుంభాభిషేకం పూజలు ప్రారంభించారు. పట్టణంలోని విస్తరణ శిక్షణా కేంద్రంలో వెలసిన శివాలయం, పిట్టల వారి సందులో వెలసిన దుర్గేశ్వర స్వామి ఆలయం, వెయ్యి లింగాల కోనలోని మార్కండేయ తీర్థం, ఊరందూరు గ్రామంలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయాలను ఇటీవల జీర్ణోదరణ చేశారు. మూడు రోజుల ముందు కలశ స్థాపన, సంకల్పం పూజలతో కుంభాభిషేకానికి అంకురార్పణ చేశారు. గురువారం నాలుగు ఆలయాల్లో వేదోక్తంగా పూజలు చేశారు. అనంతరం శిఖర కలశాలను పవిత్ర జలాలతో అభిషేకించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ముక్కంటి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో రామారావు, వేద పండితులు, అర్చకులు, పరిచారకులు తదితరులు పాల్గొన్నారు.

గల్లా అరుణకుమారికి ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: మాజీ మంత్రి గల్లా అరుణకుమారికి శ్రీకాళహస్తి టీడీపీ నేతలు ముక్కంటి ప్రసాదాలు అందజేశారు. పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో గల్లా కుటుంబం నిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో గురువారం కళ్యాణోత్సవం జరిగింది. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పలువురు టీడీపీ నాయకులతో కలిసి కళ్యాణోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గల్లా అరుణ కుమారిని శేష వస్త్రంతో సత్కరించి ముక్కంటి ఆలయ తీర్థప్రసాదాలు అంద జేశారు. అనంతరం ప్రముఖ పారిశ్రామికవేత్త గల్లా రామచంద్ర నాయుడు, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు ప్రవీణ్, తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్‌నాయుడు, ముక్కంటి ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు లోకనాథం నాయుడు, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను దగా చేయడం దుర్మార్గం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: ప్రభుత్వం ఉద్యోగులను దగా చేయడం దుర్మార్గమని శ్రీకాళహస్తి ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శించారు.

అట్టల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం.. భారీగా ఆస్తినష్టం



రేణిగుంట, ఫిబ్రవరి15: రేణిగుంట పారిశ్రామిక వాడలో గురువారం తెల్లవారుజామున అట్టల ఫ్యాక్ట రీలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరి గింది. రేణిగుంట పాంచాలీ నగర్‌కు ఉత్తరం వైపు పారిశ్రామికవాడ ఉంది. ఇందులో శ్రీవారి ప్యాకింగ్ సొల్యూషన్ అట్టల ఫ్యాక్టరీలో ఉంది. తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూ ట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. వాచ్ మన్ వెంటనే పోలీసుల ద్వారా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటా హుటిన వచ్చి మంటలు అదుపు చేశారు. సమీపంలోని ఇతర పరిశ్రమల వైపు మంటలు వ్యాపించకుండా అదుపుచేయడంతో ప్రమాదం తప్పింది. రూ.3కోట్ల ఆస్తి నష్టం జరిగిందని యజమాని పవన్‌కుమార్ వాపోయాడు. రాత్రిపూట ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం తప్పిందని జిల్లా సహాయ అగ్నిమాపక దళఅధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభించాలి


బిగినర్స్ శిక్షణకు విచ్చేసిన ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 15: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో తప్పనిసరిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ప్రారంభించాలని జిల్లా కమిషనర్ ఎంఎంరెడ్డి, కార్యదర్శి ఎం. జయరాం సూచించారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషనర్, డీఈఓ శేఖర్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా స్కౌట్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలోని బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలలో బిగినర్స్ కోర్స్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో జిల్లా కమిషనర్ ఎంఎంరెడ్డి, కార్యదర్శి జయరాం, ఎంఈఓ భువనేశ్వరి హాజయ్యారు. ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీ పురం, తడ మండలాలు నుంచి విచ్చేసిన 230 మంది ఉపాధ్యాయులు శిక్షణ తీసుకున్నారు. స్కౌట్, ప్రతిజ్ఞ, నియమ, నిబంధనలు, యూనిఫాం, స్కౌట్స్ ప్రార్థన, జెండా గీతాలతో పాటు, శాఖ నిర్వహణ, జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లా, స్థానిక కేంద్రాలతో అనసంధానం కావడంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిచారు. ముఖ్య శిక్షకులు వెంకటేశ్వర్లు, జిల్లా హెడ్ క్వార్టర్ కమిషనర్ రమేష్ బాబు, సహాయ కమిషనర్ పార్వతి, డీటీసీ సావిత్రి, జిల్లా సహాయ కార్యదర్శులు భాస్క రయ్య, విజయకుమార్, యువజన విభాగం చైర్మన్ అజరుద్దీన్, విద్యాసాగర్, మహేంద్ర, ధనుష్, రాష్ట్ర సహాయ కార్యనిర్వహణ కమిషనర్ కోటేశ్వరరావు, ట్రైనింగ్ కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, మురళి, హెడ్ మాస్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఐకమత్యానికి స్ఫూర్తిగా క్షత్రియభవన్

- క్షత్రియ భవన నిర్మాణానికి భూమిపూజ
- రూ.10 కోట్లు వెచ్చించనున్న సంఘం


వేదికపై అభివాదం చేస్తున్న క్షత్రియ సంఘం నాయకులు

రేణిగుంట, ఫిబ్రవరి15: క్షత్రియుల ఐకమత్యానికి స్ఫూర్తిగా క్షత్రియ భవన్‌ను నిర్మించుకుంటున్నట్లు రాష్ట్రీయ క్షత్రియసేవా సంఘం నాయకులు గోకరాజు గంగరాజు, డాక్టర్ ఎస్.బలరామరాజు, సీ.నారాయణరాజు, సి.మనోహర్‌రాజు తెలియజేశారు. గురువారం తూకివాకం పంచాయితీ పరిధిలో రాష్ట్రీయ క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన ఆత్మీయ సభలో నాయకులు మాట్లాడారు. తిరుపతి పుణ్యక్షేత్రంలో రాష్ట్రస్థాయి క్షత్రియభవన్ అవసరమన్నారు. ఆ మేరకు స్థలాన్ని కొనుగోలు చేశామన్నారు. సంఘం సభ్యులందరి సూచనలు, సలహాల మేరకు నిర్మాణాలు చేపట్టామని వెల్లడించారు. రాష్ట్ర క్షత్రియ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ భవన నిర్మాణానికి తనవంతు సహాయ సహకరాలు అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీవీ.గిరిరాజు, డాక్టర్ కె.అశోక్‌రాజు, పి.శ్యామరాజు, పి.వి.వి.సూర్య నారాయణ రాజు, పి.రఘువర్మ, శ్రీధర్‌వర్మ, విజయభాస్కర్‌రాజు, రుద్రరాజు శ్రీదేవి, శ్రీనివాసరాజు, బాలకృష్ణమరాజు, ఎస్.మనోహర్‌రాజు, జి.వెంకటసుబ్బరాజుతో పాటు రాష్ట్రంలోని అన్నిజిల్లాల నుంచి క్షత్రియ సంఘం నాయకులు పాల్గొన్నారు.